

# సూర్య
నేటి దినపత్రిక
www.suryaa.com

కర్నూలు నంద్యాల

గురువారం| 01 జనవరి 2026

పేజీలు 8


## పేదల జీవితంలో పెన్షనతో వెలుగులు



లబ్ధిదారుడికి ఇంటివద్దకే వెళ్లి పెన్షన్ అందచేస్తున్న కలెక్టర్ డా.ఏ సిరి

- ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్లు ఒకరోజు ముందుగానే పంపిణీ
- లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పెన్షన్లు అందజేసిన కర్నూలు కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి

2లో

## కొత్త సంవత్సరం ముందస్తు ఎన్‌టిఆర్ భరోసా



ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను పంపిణీ చేస్తున్న జిల్లా కలెక్టర్ రాజకుమారి

2లో

- యువత నీదే భవిత
- ఉమ్మడి కర్నూలును అన్ని రంగాల్లో అభివృద్ధి వైపు ఆకాంక్షిస్తూ..
- స్వాగతం 2026

# కోటి ఆశలతో కొత్త సంవత్సరంలోకి..!

కర్నూలు, మేజర్‌న్యూస్ ప్రతినిధి :

కోటి ఆశలు, ఆశయాలతో కొత్త ఉదయం మొదలు కాబోతోంది. కాలచక్రంలో మరో మైలురాయి.. 2025జ్ఞాపకాలను వీడుతూ సరికొత్త ఆశలతో 2026లోకి అడుగుపెడుతున్నాం. ఈ ఏడాది కేవలం క్యాలెండర్ మార్పు మాత్రమే కాదు ప్రతిఒక్కరి జీవితాల్లో కొత్త లక్ష్యాలకు..

మిగతా 2లో



మద్యం దుకాణం వద్ద బారులు తీరిన మందుబాబులు



న్యూఇయర్ కోసం బొకేలు తయారు చేస్తున్న దృశ్యం



బేకరీల వద్ద కేక్‌ల కోసం గుమిగూడిన ప్రజలు







# పేదల జీవితంలో పెన్షనతో వెలుగులు

**కల్లూరు, మేజర్‌న్యూస్ :** ఎన్‌టిఆర్ భరోసా సామాజిక పెన్షన్లను ప్రభుత్వం ఒకరోజు ముందుగానే పంపిణీ చేసిందని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి బుధవారం మండలంలోని ఏ గోకులపాడు గ్రామంలో అల్లాబీ, పెద్ద శబాసిం సొహెన్, తిరుపాల్‌లకు వృద్ధాప్య పెన్షన్, మహమ్మద్ రెహం, కైరున్‌బీలకు వికలాంగుల పెన్షన్, కలాంకు అన్న అభయ హస్తం, శ్రీనివాసులుకు కిడ్నీ వ్యాధిగ్రస్తుల పెన్షన్‌ను వారి ఇంటి వద్దకే వెళ్లి కలెక్టర్ అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అర్హులైన 2,37,235మంది పెన్షన్‌దారులకు రూ.104.23కోట్లు పంపిణీ చేశామన్నారు. పెన్షన్‌లను లబ్దిదారులకు పంపిణీ చేస్తూ కలెక్టర్ వారి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పెన్షన్ ప్రతి నెల సరైన సమయానికి ఇంటి వద్దకే వచ్చి అందిస్తున్నారా అని కలెక్టర్ లబ్దిదారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ సందీప్ కుమార్, డిఆర్‌డిఏ పిడి రమణారెడ్డి, తహశీల్దార్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# కొత్త సంవత్సరం..ముందస్తు ఎన్టీఆర్ భరోసా

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని పెన్షన్‌దారులకు జనవరి నెలకు సంబంధించిన ఎన్టీఆర్ భరోసా పెన్షన్‌ను ఒకరోజు ముందుగానే డిసెంబర్ 31వ తేదీన పంపిణీ చేయడం జరిగిందని కలెక్టర్ రాజకుమారి తెలిపారు. బుధవారం నంద్యాల పట్టణంలోని గోపాల్‌నగర్‌లో జిల్లా కలెక్టర్ స్వయంగా ఎన్టీఆర్ భరోసా పథకం కింద మంజూరైన పెన్షన్‌ను లబ్దిదారులకు పంపిణీ చేశారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 2లక్షల 16వేల మంది పెన్షన్‌దారులకు రూ.92కోట్లమేర ఎన్టీఆర్ భరోసా పెన్షన్‌ను బుధవారం రోజునే పంపిణీ చేయడం జరిగిందన్నారు. పేదలు, వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు ఆర్థిక భద్రతతో జీవించేందుకు ఈ పెన్షన్ పథకం ఎంతగానో దోహద పడుతోందని ఆమె పేర్కొన్నారు. పి4 ప్రభుత్వ-ప్రైవేట్, ప్రజల భాగస్వామ్యం కార్యక్రమంలో భాగంగా నంద్యాల అర్బన్ పరిధిలోని గోపాల్‌నగర్ కు చెందిన మూరబోయిన రామతులసమ్మను దత్తత తీసుకుని వారి సంక్షేమం బాగోగులు వారి సంక్షేమం పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. నూతన సంవత్సరంలో ప్రజలు ఆనందంగా, ఆరోగ్యంగా జీవించాలని జిల్లా వాసులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

# నిలిచి ఉన్న లారీని ఢీకొన్న ఆర్టీసి బస్సు

:- బస్సు డ్రైవర్ మృతి, నలుగురికి తీవ్ర గాయాలు

**కోడుమూరు, మేజర్‌న్యూస్ :** కోడుమూరు మండలం ప్యాలకుర్తి బస్‌స్టాప్ సమీపంలో ఆగి ఉన్న లారీని ఆర్టీసి బస్సు బుధవారం తెల్ల వారుజామున ఢీకొంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. ఈ ప్రమాదంలో ఆర్టీసి బస్సులో ఉన్న సహచర డ్రైవర్ శ్రీనివాసులు కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు.





మృతిచెందిన సహచర డ్రైవర్ శ్రీనివాసులు, ప్రమాదంలో దెబ్బతిన్న బస్సు

ప్యాలకుర్తి గ్రామ సమీపంలో కర్నూలు-కోడుమూరు రోడ్డులో కళ్యాణ దుర్గం డిపోకు చెందిన ఏపి02జడ్ 0576బస్సు రోడ్డుకు ఎడమపక్కన ఆగివున్న తమిళనాడుకు చెందిన టిఎన్ 82 బి 4818 లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో బస్సులో ఉన్న విజయ్ అనే వ్యక్తికి, బస్సు డ్రైవర్ బాషాతో పాటు సహచర డ్రైవర్ శ్రీనివాసులు, బసిరెడ్డిలకు తీవ్ర గాయాలయ్యాయి. మరి కొంతమందికి గాయాలయ్యాయి. ప్రమాదంలో బస్సు కూడా ఒకవైపు పూర్తిగా డ్యామేజ్ అయ్యింది. గాయాలైన వారిని కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. సహచర బస్సు డ్రైవర్ శ్రీనివాసులు (55) మృతిచెందాడు. పత్తికొండ మండలం పుచ్చకాయల మాడ గ్రామానికి చెందిన సంగటి కాశీనాథ్ అనే వ్యక్తి ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఎర్రిస్వామి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బస్సు డ్రైవర్ బాషా బస్సును అతివేగంగా, అజాగ్రత్తగా నిద్రమత్తులో ఉండి రోడ్డుకు ఎడమ వైపు ఆగివున్న లారీని ఢీకొనడంతో ప్రమాదం జరిగిందని పోలీసులు నిర్ధారించారు.

# బుగ్గన పోరుబాటతో అరటి రైతులకు ఊరట

-పెరిగిన అరటి ధర.. -బుగ్గనకు రైతుల సన్మానం..
-ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే రైతులకు కష్టాలు
-మాజీ ఆర్థికశాఖమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

**డోన్‌రూరల్, మేజర్‌న్యూస్:** అరటి రైతులకు మద్దతు ధర కల్పించాలని మాజీ ఆర్థిక శాఖమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి చేపట్టిన పాదయాత్రతోనే అరటి రైతులకు గిట్టుబాటు ధర వచ్చి ఊరట కలిగింది. ప్యాపిలి మండలంలోని హుస్సేనాపురం, చంద్రపల్లె, పిఆర్.పల్లె, నల్లమేకలపల్లె



గ్రామాలకు చెందిన అరటి రైతులు బుధవారం డోన్ పట్టణంలోని వైకాపా కార్యాలయంలో మాజీ ఆర్థికశాఖమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపి శాలువాతో సత్కరించి ఘనంగా సన్మానం చేశారు. అరటి రైతుల కష్టాలపై స్పందించిన మాజీ మంత్రి బుగ్గన కృషి వల్లే ఒక టన్ను రూ.3వేలు ఉన్న అరటి ధర నేడు రూ.25వేల వరకు చేరి అరటి రైతుల కష్టాలు తొలగాయని వారు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి మాట్లాడుతూ రైతాంగం పట్ల కూటమి ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి కారణంగానే రైతన్నలు తీవ్ర ఇబ్బందుల పాలౌతున్నారన్నారు. వ్యవసాయానికి ప్రభుత్వానికి మధ్య పూర్తిగా సమన్వయం కొరబడిందని అభిప్రాయపడ్డారు. రైతుల పంటల దిగుబడి సమయానికి ముందస్తు చర్యలు తీసుకోవడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమౌతుందని ఆరోపించారు. వైయస్ఆర్‌సిపి ఎల్లప్పుడు రైతన్నలకు అండగా ఉంటుందని భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో వైయస్ఆర్‌సిపి నాయకులు సీనియర్ అడ్వకేట్ ఎం.నాగ భూషణంరెడ్డి, మెట్టుపల్లె వెంకటేశ్వర్‌రెడ్డి, హుస్సేనాపురం సర్పంచ్ మహేశ్వర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, బొబ్బి రాము, రామాంజినేయులు, చిన్న పుల్లారెడ్డి, చెన్నకేశవులు, బాలన్న, నరసింహారెడ్డి, రాజారెడ్డి రమేష్‌యాదవ్, సిద్దనగట్టు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కోటి ఆశలతో కొత్త సంవత్సరంలోకి..!

(మొదటి పేజీ తరువాయి)

**విజయాలకు వేదిక కావాలని కోరుకుంటూ.. :** కొత్త ఏడాది అంటే పాత తప్పులను దిద్దుకుని కొత్త అలవాట్లను అలవరచుకునే సమయం. మానసిక ఆరోగ్యం, శారీరక దృఢత్వం, కొత్త నైపుణ్యాలను నేర్చుకోవడంపై దృష్టి సారించేందుకు 2026ఒక గొప్ప అవకాశం. గతం నేర్పిన పాఠాలతో, వర్తమానంలో కష్టపడుతూ, భవిష్యత్తును ఘనంగా నిర్మించుకుందాం.

**ఈ 2026 ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖసంతోషాలను, ఆరోగ్య ఐశ్వర్యాలను నింపాలని ఆకాంక్షిస్తూ.. :** సాంకేతిక విప్లవం :- 2026లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) మన దైనందిన జీవితంలో మరింత భాగం కానుంది. వైద్య,విద్య,రవాణా రంగాల్లో అద్భుతమైన మార్పులను కూడా చూడబోతున్నాం. మరోవైపు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ మరిన్ని ప్రతిష్టాత్మక ప్రయోగాలకు సిద్ధం అవుతోంది.

**పారిశ్రామిక రంగంలో :** 2026నాటికి కర్నూలు జిల్లాలో పారిశ్రామిక, మౌలిక సదుపాయాల రంగంలో దేశంలోనే ఒక కీలక కేంద్రంగా అవతరించబోయే అవకాశం ఉంది. ఇక్కడ జరుగనున్న అభివృద్ధి పనులు ఉమ్మడి జిల్లా భవిష్యత్తును సానుకూలంగా మార్చే వాతావరణం స్పష్టంగా కనబడుతోంది. మంత్రులు టీజీ భరత్, ఫరూఖ్, బిసి జనార్ధన్ రెడ్డిలు తమ తమ స్థాయిలో జిల్లాకు కావాల్సినంత నిధులు సమకూర్చి అన్ని వర్గాల ప్రజల మన్ననలు పొందాలని కృషి చేస్తున్నారు. పారిశ్రామిక అభివృద్ధి, ఉపాధి, ఇండస్ట్రియల్ హబ్‌గా ఓర్వకల్లు ప్రాంతం దేశంలోనే ఒక ప్రత్యేక గుర్తింపు పొందనుంది. దాదాపు 2621ఎకరాల్లో ఓర్వకల్లు మెగా ఇండస్ట్రియల్ హబ్‌ను విస్తరించి వేలాది కోట్ల పెట్టుబడులను తీసుకొచ్చారు. దీని ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా రూ.50వేలకు పైగా ఉపాధి లభిస్తుందని అంచనా వేస్తున్నారు. రిలయన్స్ కంజ్యూమర్ ప్రొడక్ట్స్ బ్రాహ్మణపల్లెలో రూ.1622 కోట్లతో పరిశ్రమను ఏర్పాటు చేసి పనులు ప్రారంభించారు. అంతేకాకుండా మరో కొన్ని సంస్థలు కూడా తమ యూనిట్లను ప్రారంభించాలని సన్నాహాలు ఏర్పాటు చేస్తుండడం భవిష్యత్తు ఆశలకు పునాదులు వేస్తున్నాయి. ఇదే ప్రాంతంలో భారతదేశంలోనే మొట్టమొదట డ్రోన్ సిటీని ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇది కూడా సాంకేతిక రంగంలో జిల్లాను అగ్రభాగాన నిలుపుతుంది. పిన్నాపురంలో గ్రీన్‌కో సంస్థ ప్రపంచంలోనే అతిపెద్ద ఇంటిగ్రేటెడ్ రెన్యువబుల్ ఎనర్జీ ప్రాజెక్టు నిర్మిస్తోంది. సోలార్, విండ్, పంప్డ్ స్టోరేజ్ సామర్థ్యంతో కూడిన ఈ ప్రాజెక్టు 2026నాటికి ఉత్పత్తి ప్రారంభించే అవకాశం ఉన్నట్లు చెబుతున్నారు. దాదాపు రూ.3వేల కోట్ల వ్యయంతో విద్యుత్ ప్రసార వ్యవస్థను బలోపేతం చేస్తే ఇది గ్రిడ్ స్థిరత్వానికి కీలకం అవుతుందని అధికారులు వివరిస్తున్నారు. అలాగే మౌలిక సదుపాయాలు, కనెక్టివిటీ, హైవే ప్రాజెక్టులు, రైల్వే లైన్లు రానున్నాయి. ఈ కొత్త ఏడాదిలో ఉమ్మడి కర్నూలు జిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని కోరుకుందాం.

# పాడి పశువుల పెంపకంతో ఆర్థికాభివృద్ధి సాధ్యం

– సింగిల్ విండో చైర్మన్ షాబుద్దీన్

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్:** రైతులు వ్యవసాయంతో పాటు పాడి పశువుల పెంపకం చేపట్టడం వల్ల ఆర్థికాభివృద్ధి పొందవచ్చని సింగిల్ విండో చైర్మన్ షాబుద్దీన్ అన్నారు. బుధవారం కోఆపరేటివ్ సొసైటి కార్యాలయంలో నాబార్డు సౌజన్యంతో ఎఫ్ఐఏఫ్ వారి ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత సదస్సును నిర్వహించగా ముఖ్య అతిథులుగా సింగిల్ విండో చైర్మన్ షాబుద్దీన్, పట్టణ అధ్యక్షులు వేణు, విఆర్ఎస్పి చైర్మన్ మల్లి కార్జునలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా



మాట్లాడుతున్న సింగిల్ విండో ఛైర్మన్ షాబుద్దీన్

వారు మాట్లాడుతూ రైతులు వ్యవసాయంతో పాటు పాడి రైతులు పెంపకంవైపు మొగ్గు చూపాలన్నారు. పాడి పశువుల పెంపకం వల్ల వ్యవసాయంలో చేతోడు వాదోడుగా ఉండడంతో పాటు ఆర్థిక బలోపేతం చెందవచ్చన్నారు. రైతులు నాబార్డు ద్వారా అందించే సబ్సిడీ రుణాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలన్నారు. సొసైటి ద్వారా వివిధ రకాల రుణాలను అందజేయడం జరుగుతుందని, రైతుల ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా సొసైటి పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రీసోర్స్‌పర్సన్ శ్రీనివాసులు, సొసైటి సిఇఓ నాగేశ్వరావు, డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్, రైతులు మహబూబ్ బాషా, ఫక్రుద్దీన్, రైతు సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ చట్టాలను గుర్తు చేస్తూ..

– సభను గాడిలో పెట్టిన ఎమ్మెల్సీ ..

**ఆదోని, మేజర్ న్యూస్ :** ఆదోని పట్టణాభివృద్ధికి దిక్సూచిగా చూపించబడే మున్సిపల్ బడ్జెట్ సమావేశంలో మున్సిపల్ చట్టాలను కొంతమంది కౌన్సిల్ సభ్యులకు గుర్తు చేస్తూ, సభను ఎమ్మెల్సీ బి.టి. నాయుడు గాడిలో పెట్టారు. బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ సిహెచ్ లోకేశ్వరి అధ్యక్షతన ఆదోని మున్సిపల్ కౌన్సిల్ హాలులో బడ్జెట్ సమావేశంతోపాటు సాధారణ సమావేశం. టేబుల్ అజెండాలపై సమావేశాన్ని ఏర్పాటు చేశారు. బసాపురం ఎస్ఎస్ ట్యాంకు మరమ్మత్తుల కోసం జనరల్ ఫండ్స్ నుండి డబ్బులు చెల్లించడంతో పట్టణంలో అభివృద్ధి పనులు జరగడం లేదని, రూ.60లక్షలు పెట్టి కొన్న వాకిటాకీలు ఏమయ్యాయో కౌన్సిల్లో ఎన్నిసార్లు ప్రస్తావించినా అధికారులు పట్టించుకోవడం లేదని, బసాపురం ఎస్ఎస్ ట్యాంక్ కాకుండా చిన్నహరివాణం వద్ద కొత్త ఎస్ఎస్ ట్యాంకు నిర్మాణం చేపడితే విద్యుత్ మోటార్లు లేకుండానే నీటిని పంపిణీ చేసుకోవచ్చని ఎమ్మెల్సీ బి.టి.నాయుడు వీటిపై ప్రత్యేక చొరవ చూపాలని కౌన్సిలర్ బాలాజీ కోరారు. దీనికి స్పందించిన ఎమ్మెల్సీ మాట్లాడుతూ, బసాపురం ఎస్ఎస్ ట్యాంకు లేదా మరో ఎస్ఎస్ ట్యాంకు నిర్మాణానికి సంబంధించిన డిపిఆర్‌లు తయారు చేసి అందజేస్తే ఫైనాన్స్ మంత్రి పురపాలక శాఖ మంత్రి, సీఎం చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి మార్చిలో జరగబోయే రాష్ట్ర బడ్జెట్ సమావేశాల్లో ఖచ్చితంగా నిధులు మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. శానిటేషన్ వర్కర్ల విషయమై వైస్ చైర్మన్ నరసింహులు, మున్సిపల్ కమీషనర్ మధ్య వాగ్వాదం జరిగింది. మున్సిపల్ చట్టాల ప్రకారం బడ్జెట్ సమావేశం అనంతరం సాధారణ సమావేశం నిర్వహించాలని



మున్సిపల్ కమీషనర్‌తో వాగ్వివాదం చేస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్

పట్టణాభివృద్ధికి సంబంధించిన బడ్జెట్ సమావేశం కావడంతో, దృష్టిలో పెట్టుకొని సభ్యులందరూ అంశాలన్నింటిని చర్చించిన తరువాత సాధారణ సమావేశం నిర్వహించుకుందామని చెప్పడంతో గందరగోళంగా ఉన్న కౌన్సిల్ సమావేశాన్ని ఎమ్మెల్సీ బి.టి. నాయుడు సభను గాడిలో పెట్టారు. పట్టణాభివృద్ధికి ఎంతో కీలకమైన బడ్జెట్ సమావేశంలో అన్ని అంశాల గురించి ఎంత సమయమైనా పట్టిన చర్చిద్దామని ఎమ్మెల్సీ బి.టి. నాయుడు చైర్‌పర్సన్, అధికారులను కోరారు. అంతకుముందు బడ్జెట్ సమావేశాన్ని వాయిదా వేసిన చైర్‌పర్సన్ లోకేశ్వరి తిరిగి మళ్లీ సాధారణ సమావేశం జరపాలని సభ్యులు కోరగా, కొంతసేపు చర్చల అనంతరం గందరగోళంగా ఉన్న సభను చైర్‌పర్సన్ వాయిదా వేశారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమీషనర్ కృష్ణ, అసిస్టెంట్ కమీషనర్ నాసిర్ హుస్సేన్, మున్సిపల్ ఇంజనీర్ సత్యనారాయణ, ఎంహెచ్ఓ సందీప్, అసిస్టెంట్ సిటి ప్లానర్ శిరీష,టౌన్ ప్లానింగ్ అధికారి బాల ముద్దయ్య, డి.ఈ రాజశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఆర్థర్ పుట్టినరోజు వేడుకలు

**కొత్తపల్లి, మేజర్‌న్యూస్ :** నందికొట్కూరు మాజీ ఎమ్మెల్యే తోగూరు ఆర్థర్ పుట్టినరోజు వేడుకలను బుధవారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు మద్దిలేటి ఆధ్వర్యంలో కేకును కట్ చేసి స్వీట్లు అందజేశారు. ఈ సందర్భంగా మద్దిలేటి మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే తోగూరు ఆర్థర్ నిరుపేదలకు ఎంతో సేవ చేసినట్లు తెలిపారు. ఒక జిల్లా ఎస్పీగా పని చేసి పదవీ విరమణ అనంతరం నందికొట్కూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా గెలిచి పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓబులేసు, జీవన్, చంద్రశేఖర్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

# కానిస్టేబుళ్లు శిక్షణ సమయంలో క్రమశిక్షణతో మెలగాలి

**:- జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్**



శిక్షణకు హాజరైన కానిస్టేబుళ్లు



మాట్లాడుతున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ :** ట్రైనీ కానిస్టేబుళ్లు శిక్షణ సమయంలో క్రమశిక్షణతో మెలగాలని జిల్లా ఎస్పీ విక్రాంత్‌పాటిల్ అన్నారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుండి నూతనంగా ఎంపికై శిక్షణ నిమిత్తం కర్నూలు జిల్లా పోలీసు శిక్షణ కేంద్రానికి(డిటిసి) విచ్చేసిన 205మంది ఏపిఎస్పీ ట్రైనీ పోలీస్ కానిస్టేబుళ్లకు జిల్లా ఎస్పీ బుధవారం దిశా నిర్దేశం చేసి, జిల్లా పోలీసు శిక్షణ కేంద్రంను పరిశీలించారు. అలాగే అమీలియో ఆసుపత్రి ఆద్వర్యంలో ఏపిఎస్పీ ట్రైనీ పోలీసులకు ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. ముందు జాగ్రత్తలతో టిటి ఇంజక్షన్‌లు వేయించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ కొత్త కొత్త నేరాలకు అనుగుణంగా పోలీసులు మరింతగా సాంకేతిక వృత్తి నైపుణ్యాన్ని పెంచుకోవాలన్నారు. సమన్వయంతో, మానవతా దృక్పథంతో పనిచేసి, సమస్యలను పరిష్కరించే విధంగా ఉండాలన్నారు. చట్టాల గురించి తెలుసుకోవాలన్నారు. 9నెలల పాటు శిక్షణలో ఔట్‌డోర్, ఇండోర్ శిక్షణతో పాటు టెక్నాలజీ, కమ్యూనికేషన్ స్కిల్స్, ఆయుధాల వినియోగం పట్ల శిక్షణ ఇస్తామన్నారు. మారుతున్న నేరాలకు అనుగుణంగా పోలీసు ఉన్నతాధికారులు శిక్షణలో మార్పులు చేశారని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ హుస్సేన్ పీరా, కర్నూలు డిఎస్పీ బాబు ప్రసాద్, డిటిసి డిఎస్పీ, వైస్ ప్రిన్సిపల్ దుర్గ ప్రసాద్, పోలీస్ వెల్ఫేర్ హాస్పిటల్ డా.స్రవంతి, సిఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

# ఎన్.టి.ఆర్ భరోసా పేదలకిచ్చిన నిజమైన భరోసా

**- సొసైటీ ఛైర్మెన్ సిద్ధి సత్యనారాయణ**





వృద్ధురాలుకు ఫించన్ అందిస్తున్న సొసైటీ ఛైర్మెన్ సిద్ధి సత్యనారాయణ

**దొర్నిపాడుమేజర్,న్యూస్:** ఎన్.టి.ఆర్ భరోసా ఫించన్‌లు పేదలకిచ్చిన నిజమైన భరోసా అని సొసైటీ ఛైర్మెన్ సిద్ధి సత్యనారాయణ తెలిపారు. బుధవారం మండల కేంద్రమైన దొర్నిపాడులో రాష్ట్ర ప్రభుత్వం సూపర్‌సిక్స్ పథకాల్లో భాగంగా అమలు చేస్తున్న ఎన్.టి.ఆర్ భరోసా పెన్షన్‌ల కార్యక్రమాన్ని లబ్దిదారులకు ఒకరోజు ముందే పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరై ఫించన్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూపర్‌సిక్స్ పథకాలు సూపర్‌హిట్‌గా నిలిచాయని ఆయన తెలిపారు. సామాజిక భరోసా పెన్షన్‌లు పేదలు, వృద్ధులు, వికలాంగులు, ఒంటరి మహిళలకు ఆర్థిక భరోసాగా నిలుస్తున్నాయని ఆయన అన్నారు. కూటమి ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికి చేరేలా కట్టుబడి ఉందని అందుకే ప్రజల వద్దకే వెళ్లి సేవలు అందిస్తున్నామని ప్రజల గడప దాటి పాలన ద్వారా ప్రభుత్వంపై ప్రజల్లో నమ్మకం మరింత పెరుగుతుందని గ్రామాల్లో సంక్షేమం, అభివృద్ధి రెండూ సమాంతరంగా కొనసాగుతున్నాయని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాల ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. సొసైటీ ఛైర్మెన్ సిద్ధి సత్యనారాయణ, ఎ.ఎన్.ఎం పరిమల, టీడీపీ కార్యకర్తలు చింతల గుర్రప్ప, హుసేని పాల్గొన్నారు.

# సంక్షేమం,అభివృద్ధి కూటమి ప్రభుత్వ లక్ష్యం

**- నాయకులు పెన్షన్ల పంపిణీ**
**- టీడీపీ ఇంఛార్జీ రాఘవేంద్రరెడ్డి**



పెన్షన్లను పంపిణీ చేస్తున్న టీడీపీ ఇంఛార్జీ రాఘవేంద్రరెడ్డి

**మంత్రాలయం రూరల్, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ప్రజల సంక్షేమం అభివృద్ధి కూటమి ప్రభుత్వ లక్ష్యమని మంత్రాలయం టీడీపీ ఇంచార్జీ రాఘవేంద్రరెడ్డి పేర్కొన్నారు. మంత్రాలయం మండల పరిధిలోని మాలపల్లి గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి టీడీపీ ఇంచార్జీ రాఘవేంద్రరెడ్డి జనసేన పార్టీ ఇంచార్జీ వాల్మీకి లక్ష్మన్న, బిజెపి ఇంచార్జీ విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్దిదారులతో మమేకమై మాట్లాడుతూ, ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన వారికి చేరుతున్నాయా లేదని అడిగి తెలుసుకున్నారు. పేదల సంక్షేమమే లక్ష్యంగా ప్రజల జీవితాల్లో నిజమైన మార్పు తీసుకొచ్చే విధంగా కూటమి ప్రభుత్వం పాలన సాగుతుందన్నారు. అనంతరం విలేకరులతో వారు మాట్లాడుతూ, సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్ పేర్కొన్నారు. తల్లికి వందనం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అన్నదాత సుఖీభవ పథకం దీపం పథకం ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ ఆటో డ్రైవర్లకు చేయూత గీత కార్మికుల గౌరవార్థం మద్యం దుకాణాలను కేటాయించడం వంటి సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం చంద్రబాబుకే దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు టీడీపీ మండల అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, మాజీ జెడ్పిటీసీ లక్ష్మయ్య, జిల్లా అధికార ప్రతినిధి చావిడి వెంకటేష్, సొసైటీ డైరెక్టర్ లక్ష్మన్న, వీరేష్, ఎల్లెల్సి సాగునీటి సంఘం ఛైర్మన్ చంద్ర, నరసింహులు, పొలె శివ నాగరాజు వేమారెడ్డి, ముత్తారెడ్డి, శివరాముడు, నరసింహాచారి, బిజెపి నాయకులు శ్రీకృష్ణ, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఫుడ్ కార్నివల్

**కోడుమూరు, మేజర్‌న్యూస్ :** కోడుమూరులోని క్రెసెంట్ ఈఎం హైస్కూల్‌లో రైతు దినోత్సవంతో పాటు ఫుడ్ కార్నివల్-2025ను ఘనంగా నిర్వహించారు. విభిన్న రకాల ఆహార స్టాళ్లు, వినోదాత్మక కార్యక్రమాలతో ఈ వేడుక ఆహారం, సంస్కృతి మరియు సమాజ ఐక్యతను ప్రతిభించింది. రైతుల దినోత్సవం సందర్భంగా దేశానికి అన్నం పెట్టే రైతుల అమూల్యమైన సేవలను గుర్తు చేస్తూ పాఠశాల రైతలను ఘనంగా సన్మానించింది. పాఠశాల కరస్పాండెంట్ ఖాజా హుస్సేన్ మాట్లాడుతూ రైతులను గౌరవించాల్సిన అవసరం, ఆహార వృధాను నివారించాలనే సందేశాలను విద్యార్థులలో బలంగా నాటిందన్నారు. ఈ ఫుడ్ కార్నివల్ ద్వారా విద్యార్థులు తమ సృజనాత్మకత, సహకార భావన, వ్యాపార నైపుణ్యాలను ప్రదర్శించే అవకాశాన్ని పొందారు. పంట నుంచి భోజనము పళ్లెం వరకు ఆహార ప్రయాణంపై అవగాహన కలిగించేలా ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడంలో సహకరించిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, వాలంటీర్లు, శ్రేయోభిలాషులకు కృతజ్ఞతలు తెలియజేశారు.







## అంతరాయంలేని
# విద్యుత్ సరఫరా

**విద్యుత్ సూపరింటెండెంట్ ఇంజనీర్ సుధాకర్‌కుమార్‌శర్మ**

**డోన్, మేజర్‌న్యూస్:** మండల పరిధిలోని యు.కొత్తపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ నందు మంగళవారం నూతన పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను సూపరిండెంట్ ఇంజనీర్ (ఎస్ఈ) సుధాకర్‌కుమార్‌శర్మ పూజ చేసి ప్రారంభించారు.ఆయన మాట్లాడుతూ ఈ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ వలన విద్యుత్ వినియోగదారులకు అంతరాయం లేకుండా, నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయడం జరుగుతుందన్నారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో విద్యుత్ ఈఈలు కమలాకర్‌రావు, శ్రీరాములు, డిప్యూటి ఈఈలు నాగేంద్ర, గురులింగా చారి, ఉదయ్, విద్యుత్ ఏఈలు మురళీధ ర్‌రెడ్డి, భానుచందర్, లైన్ ఇన్స్‌పెక్టర్లు, లైన్‌మెన్‌లు, విద్యుత్ సబ్‌స్టేషన్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

# 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల

**:- జడ్‌పి సిఈఓ జి నాసరరెడ్డి**

**కర్నూలు జడ్‌పి, మేజర్‌న్యూస్ :** పంచాయతీ రాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ 2025-26కు సంబంధించి 15వ ఆర్థిక సంఘం నిధులు తొలివిడత విడుదలైనట్లు జడ్‌పి సిఈఓ నాసరరెడ్డి బుధవారం తెలిపారు. ఈ నిధులను జిల్లా పరిషత్‌లు, మండల పరిషత్‌లకు సంబంధించిన బ్యాంకు ఖాతాలకు జమ చేసినట్లు పేర్కొన్నారు. ఇందులో జిల్లా పరిషత్‌కు 10శాతం నిష్పత్తితో బేసిక్ గ్రాంట్‌గా రూ.3,42,63,671లు టైడ్ గ్రాంట్‌గా రూ.5,13,95,506లు మొత్తంగా రూ.8,56,59,177లు విడుదలైనట్లు తెలిపారు. 53మండలాల పరిషత్‌లకు 20శాతం నిష్పత్తితో బేసిక్ గ్రాంట్ రూ.6,85,27,344లు, టైడ్ గ్రాంట్‌గా రూ.10,27,91,015లు మొత్తం రూ.17,13,18,359లు మంజూరైనట్లు తెలిపారు. ఈ నిధులను ప్రభుత్వ నిబంధనల మేరకు ఖర్చు చేయాలని మండల పరిషత్ అధికారులను ఆదేశించారు.

# మొదటి వారంలో కందులు కొనుగోలు

**ఓర్వకల్లు, మేజర్‌న్యూస్ :** జనవరి మొదటి వారంలో ఏపి మార్క్ ఫెడ్ ద్వారా ఎంఎస్‌పికి కందులు కొనుగోలు చేయనున్నట్లు మండల వ్యవసాయాధికారిని మధుమతి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆమె తెలిపిన వివరాల మేరకు ఖరీఫ్‌లో సాగు చేసినట్లు ఈ క్రాప్‌లో నమోదు చేసుకున్న రైతులతో కందులను కొనుగోలు చేయనున్నట్లు ప్రభుత్వం నిర్ణయించిందని, కావున మిగిలిన రైతులు రైతు సేవ కేంద్రాలలో సిఎం యాప్ ద్వారా నమోదు చేసుకోవాలని ఈ నెల 2వ తేదీ నుండి కొనుగోలు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు.

# బనగానపల్లెలో ఆర్డీఓ కార్యాలయం ప్రారంభం

**- ఇంఛార్జీ ఆర్డీఓగా నరసింహుడు**



ఆర్డీఓ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న నరసింహులు

**బనగానపల్లెమేజర్,న్యూస్:** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు బనగానపల్లె రెవెన్యూ డివిజన్ బుధవారం నుండి అధికారికంగా కార్యకలాపాలు ప్రారంభించింది. ఈ సందర్భంగా డోన్ ఆర్డీఓ బనగాపల్లె ఇంచార్జి ఆర్డీఓగా నూతన కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బనగానపల్లెను నూతన రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటుకు రాష్ట్ర రోడ్లు భవనాల శాఖా మంత్రి బి.సి జనార్ధన్ రెడ్డి ఎంతో కృషి చేశారని వారికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలను అందించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం కొత్త రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేసిందన్నారు. రెవెన్యూ డివిజన్ పరిధిలో 5 మండలాలు, 118 గ్రామాలు, 102 గ్రామ పంచాయితీలు ఉన్నాయని 2011 జనాభా లెక్కల ప్రకారం 2,91,13వేల జనభా ఉన్నట్లు ఆయన వెల్లడించారు. ప్రజా సంక్షేమ పథకాలు సమర్ధవంతంగా సక్రమంగా అమలు చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వ భూములను కాపాడుతూ రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తామని బనగానపల్లె రెవెన్యూ డివిజన్ జిల్లాలోనే అగ్రగామిలా ఉండేలా కృషి చేస్తామన్నారు.

# అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యం స్వాధీనం

**- మోటారు సైకిల్ సీజ్ - కేసు నమోదు**



కర్ణాటక మద్యంను స్వాధీనం చేసుకున్న పోలీసులు

**మంత్రాలయం రూరల్, మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని మాధవరం చెక్‌పోస్టు వద్ద అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్న సంఘటన మంగళవారం చోటు చేసుకొంది. మాధవరం చెక్‌పోస్టు సిఐ ప్రసాద్ రావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నరసింహా అనే వ్యక్తి గుల్బర్గా నుండి కర్ణాటక మద్యాన్ని అక్రమంగా 192 ప్యాకెట్స్ మోటారు సైకిల్‌పై తీసుకొని వస్తుండగా, మాధవరం చెక్ పోస్టు సిఐ ప్రసాద్‌రావు మొబైల్ పార్టీ సిఐ మొహినుద్దీన్ బాష సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ చేస్తుండగా, పట్టుపడ్డాడు. అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. మోటారు సైకిల్‌ను సీజ్ చేసికేసు నమోదు చేసినట్లు తెలిపారు. అతని రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు.

# గుండెపోటుతో రత్నపల్లి ఎంపిటిసి లక్ష్మిదేవి మృతి..

**నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మ, వైకాపా నాయకులు**



చిన్నముసలి లక్ష్మిదేవి మృతదేహానికి నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మ

**వెల్దుర్తిరూరల్, మేజర్‌న్యూస్:** మండల పరిధిలోని రత్నపల్లె గ్రామానికి చెందిన వైయస్‌ఆర్‌సిపి ఎంపిటిసి చిన్నముసలి లక్ష్మిదేవి(73) గుండెపోటుతో ఈనెల 30వ తేది మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. చిన్నముసలి లక్ష్మిదేవి మూడు తరాలకు చెందిన ఆమె మరణవార్త వినగానే కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగారు. ఆమె మరణవార్త విన్న పత్తికొండ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మ, రాష్ట్ర వైకాపా ప్రధాన కార్యదర్శి కె.ప్రదీప్‌కుమార్‌రెడ్డి, జిల్లా వైకాపా నాయకులు దేశాయ్ సమీర్‌కుమార్‌రెడ్డి, మండల వైకాపా కన్వీనర్ బొమ్మన రవీంద్రనాథ్‌రెడ్డి, జడ్పిటిసి దాదిపోగు సుంకన్న, వాణిజ్య విభాగం జిల్లా సెక్రటరీ రత్నపల్లె రమణారెడ్డి, భాస్కర్‌రెడ్డిలు బుధవారం రత్నపల్లె గ్రామానికి చేరుకొని మృతురాలు ముసలి లక్ష్మిదేవి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆమె కుటుంబానికి మనోధైర్యం కల్పించి, వారికి ఎల్లవేళలా వైకాపా అండగా ఉంటుందని భరోసానిచ్చి, సానుభూతి తెలిపారు.

# బేకరీలు కళకళ పూల అంగళ్లు వెళవెల

**బనగానపల్లెమేజర్,న్యూస్:** 2026 నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని గతంలో బేకరీలు, పూల అంగడ్లు కళకళాడేటివి అధికార ప్రతిపక్ష నాయకులకు వారి కార్యకర్తలు, అభిమానులు శక్తిమేర పూల మాలలు గజమాలలు వేసి వారి అభిమానాన్ని చాటుకునేవారు దీని ద్వార పూల అంగడ్లు భారీగా వ్యాపారం జరిగి పూల వ్యాపారులు సంవత్సరం మారుతుందంటే అది ఒక వ్యాపార దినంగా పరిగణించేవారు అయితే ఇటీవలే కాలంలో వారి పరిస్థితి మారిపోయింది. యువత నూతన సంవత్సర సందర్భంగా రంగురంగుల దుస్తులు చాక్లెట్లు, కేక్‌లు తీసుకోవడంతో వాటి వ్యాపారాలు సజావుగానే సాగుతున్నాయి. అయితే పూల వ్యాపారస్తుల పరిస్థితి మాత్రం అందుకు భిన్నంగా తయారైంది. బనగానపల్లె పట్టణంలో అధికార, ప్రతిపక్ష నేతలతోపాటు ద్వితియస్థాయి నేతలు కూడా అందుబాటులో లేకపోవడంతో పూల వ్యాపారస్తులు ఆందోళన చేస్తున్నారు. జనవరి సందర్భంగా ఇతర రాష్ట్రాల నుంచి రంగురంగుల పూలను తీసుకువచ్చి దండలు తయారు చేసి ఉంచారు. వ్యాపారం లేకపోవడంతో నష్టాలను చవిచూస్తున్నామని వారు ఆందోళన వ్యక్తం చేశారు.


వెళవెలబోతున్న వ్యాపారాలు

# ముఖ్యమంత్రికు,లోకేష్‌కు ధన్యవాదాలు తెలిపిన మంత్రి బి.సి

**బనగానపల్లెరూరల్‌మేజర్,న్యూస్:** బనగానపల్లె నూతన రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు సహకరించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నారా లోకేష్‌కు రాష్ట్ర రోడ్లు భవనాల శాఖా మంత్రి బి.సి జనార్ధన్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. బనగానపల్లె కొత్త రెవెన్యూ డివిజన్ గెజిట్ విడుదల చేసిన క్రమంలో బుధవారంనాడు కార్యాకలాపాలు ప్రారంభం కావడం తనకెంతో సంతృప్తినిచ్చిందన్నారు. బనగానపల్లె ప్రజల చిరకాలవాంఛ నెరవేరిందన్నారు. గతంలో సంజామల, కొలిమిగుండ్ల మండలాలు, నంద్యాల రెవెన్యూ డివిజన్ పరిధిలో బనగానపల్లె, అవుకు, కోవెలకుంట్ల మండలాలు, డోన్ రెవెన్యూ పరిధిలో ఉండటంతో ప్రజలు ఇబ్బంది పడేవారని ప్రజల మనోభావాలు మేరకు 5 మండలాలు ఒకే రెవెన్యూ డివిజన్‌లోకి తీసుకురావడం సంతోషంగా ఉందన్నారు.


మంత్రి బి.సి ఫైల్‌ఫోటో

# ప్రజల జీవితాల్లో సుఖసంతోషాలు వెల్లివిరియాలి

**:– కమీషనర్ పి విశ్వనాథ్**

**కర్నూలు (కెఎంసి), మేజర్‌న్యూస్ :** 2026నూతన సంవత్సరంలో ప్రజల జీవితాల్లో సుఖసంతోషాలు వెల్లివిరియాలని నగరపాలక సంస్థ కమీషనర్ పి విశ్వనాథ్ ఆకాంక్షించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ నూతన సంవత్సరం పురస్కరించుకుని కర్నూలు నగర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలు స్వచ్ఛంధ సహకారం, సామాజిక బాధ్యత మరింత పెరిగితే నగరాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లవచ్చని ఆయన పేర్కొన్నారు. పరిశుభ్రత, పౌర సేవలు, నగర సుందరీకరణ మెరుగుదలలో ప్రతిఒక్కరు భాగస్వాములు కావాలని కమీషనర్ కోరారు.


కమీషనర్ విశ్వనాథ్

**న్యూఇయర్ శుభాకాంక్షలు తెలిపిన జిల్లా ఎస్పీ :–** జిల్లా ప్రజలకు ఎస్పీ విక్రాంత్ పాటిల్ 2026 నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. గత ఏడాది కంటే ఈ ఏడాది ప్రజలు మరింత మెరుగ్గా సంతోషంగా జీవించాలని ఆకాంక్షించారు. కొత్త సంవత్సరంలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడకుండా, యువత మత్తుకు అలవాటు పడి జీవితాలు నాశనం చేసుకోకుండా, వాహనదారులు రోడ్డు ప్రమాదాలకు గురికాకుండా తమ కుటుంబాలతో సంతోషంగా జీవించాలని కోరుకున్నారు.

# ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

**-రాష్ట్ర న్యాయ,మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్.ఎం.డి. ఫరూక్**

**-ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం క్యాలెండర్ ఆవిష్కరించిన మంత్రి ఫరూక్**

**నంద్యాల టౌన్ మేజర్ న్యూస్:** రాష్ట్రంలో ఉద్యోగుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తుందని న్యాయ మరియు మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్.ఎం.డి. ఫరూక్ అన్నారు. బుధవారం నంద్యాలలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (జిల్లా, సిటీ, మహిళా విభాగాల) టేబుల్ క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్బంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ ప్రభుత్వ యత్రాంగంలో ఉద్యోగుల పాత్ర కీలకం అన్నారు. రాష్ట్రంలో ఉద్యోగుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తుందన్నారు. ఈ సందర్భంగా ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు నాగేంద్రప్ప మాట్లాడుతూ.. "భజనతో కాదు –బాధ్యతతో" అనే నినాదంతో పనిచేస్తున్న తమ సంఘం, రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్ సూర్యానారాయణ నాయకత్వంలోఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తోందన్నారు. 1వ తేదీనే జీతాలు ఇవ్వాలని గవర్నర్‌ను కోరిన ధీశాలి ఆయనని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నాగేంద్రప్ప, కార్యదర్శి శ్రీనివాసులు, మహిళా అధ్యక్షురాలు ప్రభావతమ్మ, సిటీ అధ్యక్షుడు కోటేశ్వరరావు, చక్రవర్తి గౌడ్, విజయలక్ష్మి, సురేష్ తదితర నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.



# ఎమ్మిగనూరు అభివృద్ధికై రూ. 133 కోట్ల బడ్జెట్ అంచనాలు

- ★కేక్‌కట్ చేసుకుని నూతన సంవత్సర సంబరాలు
- ★కౌన్సిలర్ల సమస్యలు ఏకరువు
- ★నేతలు డబ్బున్నవారికే పీఠం అందిస్తారని కౌన్సిలర్ బజారి వ్యాఖ్యలు
- ★ వార్డుల అభివృద్ధి శూన్యం అని మండిపాటు

**ఎమ్మిగనూరు , మేజర్‌న్యూస్ ప్రతినిధి :** 2026 ఏడాదిలో ఎమ్మిగనూరు అభివృద్ధికై మున్సిపల్ కౌన్సిల్ రూ. 133 కోట్ల రూపాయల మేర అంచనాలు వేసి బడ్జెట్ ప్రవేశ పెట్టింది. బుదవారం చైర్మన్ కెఎస్ రఘు అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ సమావేశంలో ముందుగా 28 అంశాల అజెండాను ఆమోదం తెలిపారు. అనంతరం రూ. 133 కోట్లతో బడ్జెట్ ప్రవేశపెట్టి ఆమోదించారు. అంతకు ముందు 2025 ఏడాదికి వీడ్కోలు పలుకుతూ నేటి 2026 సంవత్సరానికి స్వాగతం చెబుతూ చైర్మన్ టేబుల్‌పై కౌన్సిల్ సభ్యులు, అధికారులు కేక్ కట్ చేసి నూతన సంత్సర శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం భాజాపా కైన్సిలర్ దయాసాగర్ మాట్లాడుతూ ఎమ్మిగనూరు పట్టణానికి కేంద్రం పంపిన నిధులు , వాటితో జరిగిన అభివృద్ధి పనులను వివరించారు. అనంతరం 3 వార్డు కౌన్సిలర్ స్వాతి తన వార్డులో జరిగిన పనులకు అధికారులకు కృతజ్ఞతలు తెలుపుతూనే ఇంకా తాను కోరిన సమస్యలు ప్రజలు ఇబ్బంది పడేవాటిపై చొరువ చూపాలని విన్నవించారు. 2 వ వార్డు నుండి అంపమ్మ, 21 వార్డు నుండి కేశవరెడ్డి , 25 వ వార్డు నుండి సరోజమ్మ, 28 వవార్డు నుండి బజారిలు ఆయా వార్డుల్లో ఉన్న సమస్యలుపై కౌన్సిల్‌ల్లో అధికారులను నిలదీశారు. 28 వార్డు కౌన్సిలర్ బజారి మున్సిపల్ ఎన్నికల ముందు తన వార్డులో ప్రజలకు ఇచ్చిన హామీలను మరిచారని చైర్మన్ రఘును ప్రశ్నించారు. అంతటితో ఆగక నేతలు మున్సిల్ పీఠాన్ని డబ్బు ఉన్నోళ్లకు అందిసా ్తరని ..దమ్మున్నోళ్లకు ఇవ్వరని సంచలన వ్యాఖ్యలు చేశారు. తన వార్డులో ఐదేళ్లలో తాగునీరు, యుజిడి, రహదారుల పనుల జరగక కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారు దీనికి అధికారులు కౌన్సిల్లోనే సమాదానం ఇవ్వాలని పట్టుబట్టారు. అనంతరం టెబుల్ అజెండాగా 8 అంశాలకు ఆమోదంకు ఉంచారు కౌన్సిల్ వీటికి కూడా ఆమోదం తెలిపింది. కౌన్సిలర్లు అడిగిన సమస్యలు అన్నింటిని గుర్తుంచుకుని త్వరలో పనులు ముగించేస్తాం అని కమీషనర్ గంగిరెడ్డి తెలిపారు. ఇదిలాఉండగా బాజాపా కౌన్సిలర్ దయాసాగర్ ఎమ్మిగనూరు పట్టణ వాసులకు కులాలవారిగా ఉన్న స్మవాన వాటికల స్థలాలు గుర్తించి వారిటి సరిహద్దులుగా ప్రహారి గోడలు నిర్మించి కాపాడాలని కౌన్సిల్ దృష్టిలో ఉంచారు. అలాగే వైకాపా నేతల్లో స్మశానం కబ్జా చేసిన 171ఏ సర్వేనెంబర్ విషయాన్ని తేల్చాలని పట్టుబట్టారు. దంతో కమీషనర్ గంగిరెడ్డి సమాదానం ఇస్తూ డిప్యూటి కలెక్టర్, రెవిన్యూ విభాగం, మున్సిపల్ విభాగం అంతా పరిశీలించామని డిప్యూటి కలెక్టర్ ఎక్కడా సదరు స్థలం కబ్జాకు గురికాలేదన్న విషయం వెల్లడించడం జరిగిందన్నారు.


28వ వార్డు సమస్యలపై కౌన్సిలర్ బజారి గళం

# రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలలో తొగ్రేచేడు విద్యార్థుల ప్రతిభ

**కృష్ణగిరి,మేజర్‌న్యూస్ :** కర్నూలులో డిసెంబరు 29న జరిగిన రాష్ట్ర స్థాయి రగ్బీ సబ్ జూనియర్ పోటీలలో మం డల పరిధిలోని తొగ్రేచేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇరువురు విద్యార్థులు ప్రతిభను కనబర్చినట్లు పాఠశాల హెచ్ఎం నాగరాజు తెలిపారు. బాలుర విభాగంలో 6వ తరగతి విద్యార్థి అరవింద్ జిల్లా జట్టులో అత్యంత నైపుణ్యం ప్రదర్శించి ద్వితీయ స్థానం సాధించాడని హెచ్ఎం తెలిపారు. అలాగే బాలికల విభాగంలో 7వ తరగతి విద్యార్థినీ రజియా మంచి ప్రతిభను కనబర్చినట్లు ఆయన తెలిపారు. ఇరువురు విద్యార్థులు తమ పాఠశాల నుండి రగ్బీ సబ్ జూనియర్ పోటీలలో మంచి ప్రతిభకనబర్చారని హెచ్ఎం,ఉపాధ్యా యులు హర్షం వ్యక్తం చేశారు.



# వృద్ధులకు వరం ఎన్.టి.ఆర్ భరోసా పెన్షన్

**అవుకుమేజర్,న్యూస్:** సమాజంలోని వృద్ధులకు, వికలాంగులకు, ఎన్.టి.ఆర్ భరోసా ఫించన్ ఒక వరం లాంటిదని అవుకు మండల టీడీపీ అద్యక్షుడు ఐ.వి ఉగ్రసేనారెడ్డి అన్నారు. ప్రభుత్వ ఆదేశాలలో భాగంగా ఒకరోజు ముందుగా నూతన సంవత్సర కానుకగా బుధవారం సంఘుపట్నం గ్రామంలో వృద్ధులకు వికలాంగులకు ఆయన ఫించన్‌ను పంపిణీ చేయడం జరిగింది. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ప్రజలకిచ్చిన ప్రతి హామిని నెరవేర్చడం జరుగుతుందని అన్నారు. ఇందులో భాగంగానే వృద్ధులకు వికలాంగులకు ఫించన్‌లు కూడా పెంచడం జరిగిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 60లక్షలకు పైగా ఫించన్‌ను ప్రతి నెల పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఈ ఫించన్‌ల పంపిణీపట్ల వృద్ధులు, వికలాంగులలో ఆనందం మానసిక స్థైర్యం పెరుగుతుందన్నారు.


ఫించన్ అందజేస్తున్న దృశ్యం







## మహానందీశ్వరుని సన్నిధిలో బీజేపీ ఎమ్మెల్యే

**మహానంది, మేజర్ న్యూస్ :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన మహానందిలో హైదరాబాద్ గోశాల బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ పూజలు నిర్వహించారు. అనంతరం వారు శ్రీ కామేశ్వరీ సమేత మహానందీశ్వర స్వామి వార్లకు అభిషేకార్చన పూజలు నిర్వహించారు.



# నేటి నుంచే బనగానపల్లె కొత్త రెవెన్యూ డివిజన్ ప్రారంభం

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నూతనంగా ఏర్పాటు చేసిన బనగానపల్లె రెవెన్యూ డివిజన్ నేటి నుంచే అధికారికంగా కార్యకలాపాలు ప్రారంభించిందని జిల్లా కలెక్టర్ రాజకుమారి తెలిపారు. బుధవారం అమరావతి సచివాలయం నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి బనగానపల్లె కొత్త రెవెన్యూ డివిజన్‌పై సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ చాంబర్ నుంచి జిల్లా కలెక్టర్ రాజకుమారి, డీఆర్వో రామునాయక్, జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు తదితర అధికారులు పాల్గొన్నారు. తకొత్త రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు సంబంధించి రాష్ట్ర రోడ్లు, భవనాలు,


అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ రాజకుమారి

పెట్టుబడులు, మౌళిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, జిల్లా కలెక్టర్, రెవెన్యూ డివిజన్ అధికారి ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కొత్త రెవెన్యూ డివిజన్‌కు డోన్ ఆర్డీవో నరసింహులు ఇన్‌చార్జి ఆర్డీవోగా పదవీ బాధ్యతలు చేపట్టారని తెలిపారు గతంలో బనగానపల్లె నియోజకవర్గ పరిధిలోని సంజామల, కొలిమిగుండ్ల మండలాలునంద్యాల రెవెన్యూ డివిజన్ పరిధిలో, అలాగే బనగానపల్లె, అవుకు, కోవెలకుంట్ల మండలాలు డోన్ రెవెన్యూ డివిజన్ పరిధిలో ఉండేవని తెలిపారు. ప్రజలు తమ అవసరాల నిమిత్తం నంద్యాల, డోన్ పట్టణాలకు వెళ్లాల్సి వచ్చి అనేక ఇబ్బందులు, వ్యయ ప్రయాసాలు ఎదుర్కొనేవారని తెలిపారు. ప్రజల మనోభావాలను గౌరవిస్తూ పరిపాలనా సౌలభ్యాన్ని దృష్టిలో పెట్టుకుని బనగానపల్లె నియోజకవర్గంలోని 5మండలాలను ఒకే రెవెన్యూ డివిజన్ పరిధిలోకి తీసుకుని రావడం ఆనందకర పరిణామం అన్నారు.

# 3న వ్యవసాయ శాఖ మంత్రి రాక

**కోడుమూరు, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఈ నెల 3న కోడుమూరుకు రానున్నట్లు జిల్లా కలెక్టర్ డా.ఎ సిరి తెలిపారు. ఈ మేరకు బుధవా రం కోడుమూరులో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో రైతులతో సమావేశం సభ ఏర్పాట్లను ఆర్డీఓ సందీప్ కుమార్‌తో కలిసి కలెక్టర్ బుధవారం పరిశీలించారు. మంత్రి అచ్చెన్నాయుడుతో పాటు జిల్లా మంత్రులు టీజీ భర త్, బిసి జనార్ధన్ రెడ్డిలు హాజరవుతారన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ జెడిఎ వరలక్ష్మి, ఉద్యాన శాఖ అధికారులు, ఎంపిడిఓ రాముడు, తహశీల్దార్ నాగరాజు, ఈఓఆర్‌డి మంజుల తదితరులున్నారు.


ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్

# 18నెలల పాలన..రూ.50వేల కోట్ల సంక్షేమం..!

**కర్నూలు, మేజర్‌న్యూస్ :** రాష్ట్రంలో ఎన్‌డిఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 18నెలల కాలంలో రూ.50వేల కోట్ల మేర అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసిందని కర్నూలు జిల్లా తెదేపా అధ్యక్షురాలు గుడిసె కృష్ణమ్మ వెల్లడించారు. బుధవారం జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వ అరాచక పాలనను అంతం చేసిన ప్రజలు కూటమికి పట్టం కట్టారని పేర్కొన్నారు. ఈ కాలంలో సాధించిన ముఖ్య విజయాలను ఆమె వివరించారు. తల్లికి వందనం పథకం ద్వారా 67,27లక్షల మంది విద్యార్థులకు రూ.10,090కోట్లు, అన్నదాత సుఖీభవ కింద 46లక్షల మంది రైతులకు రూ.6,310కోట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, దీపం పథకం కింద 3ఉచిత సిలిండర్లు, ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్ల కోసం రూ.50,000కోట్లకు పైగా వ్యయం చేశామని వివరించారు. మెగా డిఎస్సీ ద్వారా


మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షురాలు గుడిసె కృష్ణమ్మ

15,941ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి శ్రీకారం చుట్టారని, పారిశ్రామికంగా లక్షల కోట్ల పెట్టుబడులు, ఉద్యోగాల కల్పనకు ఒప్పందాలు జరిగాయని పేర్కొన్నారు. ప్రతి ఇంటికి మంచినీటి కొళాయి కనెక్షన్లు, ఉచిత పట్టాల పంపిణీ వంటి అనేక పథకాలతో రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనిస్తోందని ఆమె స్పష్టం చేశారు. ఈ సమావేశంలో పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అందరూ మెచ్చే విధంగా కూటమి పాలన..!

**-ఒక్కరోజు ముందు పింఛన్లు అందించే ప్రభుత్వం మాది**
**-వృద్ధులకు పింఛన్ పంపిణీ చేసిన ఎమ్మెల్యే బీవీ**

**ఎమ్మిగనూరు టౌన్ మేజర్ న్యూస్:** రాష్ట్రంలో అందరూ మెచ్చే విధంగా కూటమి పాలన కొనసాగుతుందని, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో ప్రతి ఇంట సంతోషంగా ఉన్నారంటూ ఎమ్మెల్యే బీవీ జయ నాగేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. సామాజిక పింఛన్ పంపిణీ కార్యక్రమంలో భాగంగా బుధవారం పట్టణంలోని ఐదో వార్డులోని శివన్న నగర్‌లో ఆయన పర్యటించి ఇంటింటికి వెళ్లి వృద్ధులకు, వికలాంగులకు


పెన్షన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బి.వి.జయ నాగేశ్వర్‌రెడ్డి

పెన్షన్ నగదును ఆయన చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీవీ వార్డులో పర్యటిస్తూ ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కారం చేశారు. వార్డు సుడిగాలి పర్యటన చేసి ప్రజలకు సౌకర్యార్థంగా రోడ్లు, డ్రైనేజీలు వంటి వెంటనే వెయ్యాలని మున్సిపల్ కమిషనర్ కు ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే బీవీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రతి పేదవాడి ఇంట్లో పెద్దకొడుకుగా నేనున్నానంటూ పింఛన్లు ఐదురెట్లు పెంచి భరోసా కనిపిస్తున్నారని తెలిపారు.ఎమ్మిగనూరు పట్టణంలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు భాస్కర్ల చంద్రశేఖర్, కుర్ని కార్పొరేషన్ చైర్మన్ కామర్తి మిన్నప్ప, పట్టణ అధ్యక్షులు మాచాని మహేష్, టీడీపీ నాయకులు రంగస్వామి గౌడ్, అమానుల్లా, ఈరన్న, నాగూర్ బాషా, పార్టీ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయి పోటీల్లో ఎల్‌కేఆర్ పాఠశాల విద్యార్థుల ప్రతిభ

**-హైదరాబాద్ త్యాగరాజ గాన సభలో పతకాల పంట**
**-ద్వితీయ బహుమతులు సాధించిన ఎనిమిది మంది విద్యార్థులు**



**నంద్యాల టౌన్ మేజర్ న్యూస్:** హైదరాబాద్ చిక్కడపల్లిలోని త్యాగరాజ గానసభ వేదికగా నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో నంద్యాల ఎల్‌కేఆర్ పాఠశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారు. 'శ్రీ కోదండపాణి అంతా రామాయణం' పేరిట నిర్వహించిన ఈ పోటీల్లో పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు తమ నైపుణ్యంతో అందరినీ ఆకట్టుకుని ద్వితీయ బహుమతులను కైవసం చేసుకున్నారు. రాష్ట్ర స్థాయిపోటీల్లోరాణించి రెండోబహుమతిసాధించిన వారిలో..షణ్ముఖ ప్రియ,దీక్షిత,హర్షత్,విశాంత్ రెడ్డి,తరుణ్,నిత్య వాసవి,లిఖిత సాయి,షణ్ముఖ ఉన్నారు.రాష్ట్ర స్థాయిలో పాఠశాల పేరును నిలబెట్టిన విద్యార్థులను ఎల్‌కేఆర్ పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ బృందం ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థుల కష్టానికి, ఉపాధ్యాయుల శిక్షణ తోడవడంతోనే ఈ విజయం సాధ్యమైందని వారు పేర్కొన్నారు. తమ పిల్లలు రాష్ట్ర స్థాయిలో రాణించడంపై తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

# కలెక్టర్‌ను కలిసిన యువ ఆపద మిత్ర మాస్టర్ ట్రైనర్లు



**నంద్యాల టౌన్ మేజర్ న్యూస్ :** యువ ఆపద మిత్ర పథకం కింద ఒడిశా రాజధాని భువనేశ్వర్‌లో 21 రోజుల పాటు నిర్వహించిన రెసిడెన్షియల్ శిక్షణను నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ నియోజవర్గం పాత కందుకూరుకు చెందిన మాస్టర్ ట్రైనర్లు మిల్లిల్లషరీఫ్, బత్తులూరు గ్రామానికి చెందిన రవీంద్రారెడ్డి విజయవంతంగా పూర్తి చేసుకున్నారు. శిక్షణ అనంతరం జిల్లాకు చేరుకున్న వారు స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ రాజకుమారి, జాయింట్ కలెక్ట ర్ కె. కార్తీక్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. విపత్తులు సంభవించినప్పుడు తక్షణమే స్పందించిప్రాణ,ఆస్తి నష్టాలను తగ్గించడంలో ఆపద మిత్రల పాత్ర కీలకమని పేర్కొన్నారు. శిక్షణలో నేర్చుకున్నమెలకువలనుక్షేత్రస్థాయిలో సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు. భువనేశ్వర్‌లో పొందిన శిక్షణ అనుభవాలను ట్రైనర్లు ఈ సందర్భంగా అధికారులకు వివరించారు.

# వార్డులోని ప్రతి అర్హుడికి ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేస్తా

**- 38 వ వార్డ్ టీడీపీ ఇంచార్జ్ దేరెడ్డి శివనాగిరెడ్డి**
**- ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న దేరెడ్డి శివనాగిరెడ్డి**

**నంద్యాల టౌన్ మేజర్ న్యూస్:** నంద్యాల 38వ వార్డు పరిధిలోని నందమూరి నగర్, వైఎస్సార్ నగర్‌లో 'ఎన్టీఆర్ భరోసా' పింఛన్ల పంపిణీ పండుగలా సాగింది. రాష్ట్ర మంత్రి ఎన్.ఎమ్.డి. ఫరూక్ ఆదేశాల మేరకు, జిల్లాప్రధాన కార్యదర్శి ఎన్.ఎమ్.డి. ఫిరోజ్



ఆధ్వర్యంలో వార్డు ఇంచార్జ్ దేరెడ్డి శివనాగిరెడ్డి లబ్ధిదారుల ఇంటింటికీ వెళ్లి పింఛన్ సొమ్మును అందజేశారు.నూతన సంవత్సర కానుకగా ఒక్కరోజు ముందుగానే పింఛన్ అందడంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు.పేదలసంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని, ప్రతి అర్హుడికి అండగా ఉంటామని శివనాగిరెడ్డి ఈ సందర్భంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

# పదవ తరగతి మంచి భవిష్యత్తుకు పునాది

**:– జిల్లా కలెక్టర్ డా.ఏ సిరి**

**కల్లూరు, మేజర్‌న్యూస్ :** పదవ తరగతి విద్యార్థుల మంచి భవిష్యత్తుకు పునాది అని, విద్యార్థులు కష్టపడి చదివి మంచి మార్కులు తెచ్చుకోవాలని జిల్లా కలెక్టర్ డా.ఏ సిరి అన్నారు. బుధవారం కల్లూరు మండలం ఏ గోకులపాడు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలలో


విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ డా.ఏ సిరి

100రోజుల ప్రణాళికను సమర్థవంతంగా అమలు చేసి, 10వ తరగతి పబ్లిక్ పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించాలని హెడ్‌మాస్టర్‌ను ఆదేశించారు. సి, డి గ్రేడ్ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపించి వారిని బాగా చదివించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. విద్యార్థులతో మాట్లాడి ఎలా చదవాలి, మార్కులు ఎలా తెచ్చుకోవాలని కలెక్టర్ అవగాహన కల్పించారు. పబ్లిక్ పరీక్షలకు కేవలం 70రోజుల సమయం మాత్రమే ఉందని విద్యార్థులు అప్రమత్తమై చదువుకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. వంటగదిని కలెక్టర్ పరిశీలిస్తూ ఈరోజు మెనూ ప్రకారం ఏ భోజనం చేశారని కలెక్టర్ వంట సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వంటగదిని చాలా శుభ్రంగా ఉంచుకున్నారని కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. ముందుగా కలెక్టర్ పాఠశాల ఆవరణలో మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ సందీప్ కుమార్, డిఆర్‌డిఏ పిడి రమణారెడ్డి, తహశీల్దార్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ ఎర్రమట్టి రవాణాను అడ్డుకున్న విజిలెన్స్ అధికారులు

**– రెండు టిప్పర్లు సీజ్**

**మహానంది, మేజర్‌న్యూస్ :** మహానంది మండలంలోని గాజులపల్లి సమీపంలో ఎర్రవంక నుంచి అక్రమంగా తరలిస్తున్న ఎర్రమట్టి రవాణాను విజిలెన్స్ అధికారులు అడ్డుకున్నారు. రెండు టిప్పర్లను సీజ్ చేశారు. బుధవారం ఉదయం అక్రమంగా తరలిస్తున్న టిప్పర్లపై నంద్యాల జిల్లా మైన్స్ అండ్ జియాలజీ ఆఫీసర్ వేణుగోపాల్ దాడులు నిర్వహించారు. రెండు టిప్పర్లను సీజ్ చేసి మహానంది పోలీసు స్టేషన్‌కు తరలించారు. మరికొన్ని టిప్పర్లు మట్టిని అక్కడికక్కడే వదిలేసి తప్పించుకు వెళ్లినట్లు తెలుస్తుంది. ప్రతిరోజూ రాత్రి పూట ఎర్రవంక నుంచి పదుల సంఖ్యలో టిప్పర్లతో ఎర్రమట్టి రవాణాను చేస్తున్నారు. ఇటుకల బట్టీలకు విక్రయించుకుంటూ యదేచ్ఛగా అక్రమ వ్యాపారం చేస్తున్న వారిపై ఈ దాడులు చేశారు.


మహానంది పోలీసు స్టేషన్ వద్ద ఉన్న టిప్పర్లు

సూర్య

గురువారం| 01 జనవరి 2026

APPSC,TGPSC UPSC CIVIL SERVICES EXAMS SPECIAL

# మానవ హక్కులు-పరిరక్షణ

**మానవుల మనుగడకు అవసరమైన కనీస హక్కులే మానవ హక్కులు. ఇవి కుల, మత, ప్రాంత, లింగ భేదాలకు అతీతం. మానవ హెూదాను పరిరక్షించడానికి మానవ హక్కులు అవసరం. పౌర స్వేచ్ఛలో జోక్యం చేసుకోవడానికి రాజ్యం ప్రయత్నించినప్పుడు అడ్డుపడే రక్షణలే మానవ హక్కులు అని రోనాల్డ్ డార్విన్ అభిప్రాయపడ్డాడు. జాక్ డోన్నీ అభిప్రాయంలో నాగరికతకు నూతన ప్రమాణాలే మానవ హక్కులు. అందరికి మానవ హక్కులు అనేది ఐరాస 21వ శతాబ్ది నినాదం.**

**మానవ హక్కుల రూపాలు:**

1. వివక్ష నుంచి స్వాతంత్ర్యం, కుల, మత, లింగ, తెగ, ప్రాంతీయ వివక్షతకు గురికాకుండా ఉండటం.
2. బానిసత్వం నుంచి స్వాతంత్ర్యం, గౌరవ ప్రదమైన జీవన ప్రమాణాలను అనుభవించటం.
3. వ్యక్తిలోని నిబిడీకృతమైన శక్తి సామర్థ్యాలను ఉపయోగించుకునే స్వాతంత్ర్యం
4. భయం నుంచి స్వాతంత్ర్యం, ప్రాణానికి భద్రత, హింస, నిర్బంధానికి గురికాకుండా ఉండటం
5. ఆర్థిక్యం నుంచి స్వాతంత్ర్యం
6. ఆలోచన, వాక్ స్వాతంత్ర్యం, సంఘాలుగా ఏర్పడే స్వాతంత్ర్యం
7. గౌరవప్రదమైన పనిచేసుకునే స్వాతంత్ర్యం, పీడనాన్ని నిరోధించే హక్కు

మానవ హక్కులు, మానవాభ్యుదయం రెండిటిదీ విడదీయరాని బంధం, ఐక్యరాజ్యసమితి చార్టర్లో, మానవ హక్కుల ప్రకటనలో, ఇతర అంతర్జాతీయ చార్టర్లలో మానవ హెూదా (Dignity) ను ప్రత్యేకంగా ప్రస్తావించారు. భారత రాజ్యాంగం కూడా పీఠికలో మానవ హెూదాను ప్రాథమిక విలువగా పేర్కొన్నది. సార్వత్రిక మానవ హక్కుల ప్రకటన ఐరాసలో రూపుదిద్దుకుంటున్న తరుణంలోనే (1948) మన రాజ్యాంగ రూపకల్పన కూడా ప్రారంభమయ్యింది. రాజ్యాంగంలో మూడో భాగంలో వివరించిన ప్రాథమిక హక్కులు, ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల చార్టర్లోని 2 నుంచి 21 వరకూ ప్రకరణలు అదేవిధంగా రాజ్యాంగంలో నాల్గో భాగంలో వివరించిన ఆదేశసూత్రాలు, ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల చార్టర్లోని 22 నుంచి 28 ప్రకరణలు ఒకే రకమైనవి. 1968లో ఐరాస ఆమోదించిన అంతర్జాతీయ పౌర, రాజకీయ హక్కుల ఒప్పందం, అంతర్జాతీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక హక్కుల ఒప్పందం మానవహక్కుల పరిధిని మరింత విస్తృతం చేశాయి.

మానవ హక్కుల భావనను రెండో ప్రపంచ యుద్ధానంతరం వచ్చిన ఆలోచనగా భావిస్తున్నారు. వాస్తవానికి హక్కుల భావన అమెరికా స్వాతంత్ర్య ప్రకటన (1776) లో ఒక ముఖ్య నినాదం. మానవులంతా సమానులు. అన్యాక్రాంతం గురికావడానికి వీలులేని హక్కులను సృష్టికర్త ప్రసాదించాడు. ఫ్రెంచి విప్లవ ప్రకటన (1798) కూడా దాదాపు ఇదే అభిప్రాయాన్ని తెలియజేస్తుంది. మానవులు స్వతంత్రులుగా జన్మించి స్వతంత్రంగా కొనసాగుతూ సమాన హక్కులతో ఉంటారు. దురదృష్టవశాత్తూ ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాలలో పలు కారణాలతో మానవ హక్కుల ఉల్లంఘన జరుగుతున్నది. అంతర్జాతీయంగా మానవ హక్కుల పరిరక్షణ కోసం కృషి చేయడానికి ఐరాస మానవహక్కుల కమిషన్ను 1946లో ఏర్పాటు చేశారు. సాంఘీక, ఆర్థిక మండలిలో అంతర్భాగమైన ఈ కమిషన్లో 53 సభ్యదేశాలకు మూడేళ్ల పదవీ కాలానికి సభ్యత్వముండేది. ప్రతి ఏటా 1/3 వంతు మంది పదవీ విరమణ చేసేవారు. మానవ హక్కుల ప్రోత్సాహం, పరిరక్షణ కార్యకలాపాల నిర్వహణకు ఒక ఉప కమిషన్ పనిచేసేది. దాని స్థానంలో 2006లో మానవ హక్కుల కౌన్సిల్ ఏర్పాటయ్యింది.

**భారతదేశంలో మానవ హక్కులు:** ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్లో 1960, 1970 దశాబ్దాలలో మానవ హక్కుల ఉల్లంఘనలు ఎక్కువగా జరిగాయన్న విమర్శలు వచ్చాయి. సగటు పౌరునికి ప్రాణ రక్షణ, వాక్ స్వాతంత్ర్యం మొదలైనవి నానాటికీ కరవవుతున్నాయని పౌర సమాజం ఉద్యమించింది. రాజకీయ నాయకుల్లో, ప్రభుత్వోద్యోగుల్లో జవాబుదారీతనం సన్నగిల్లింది. దీంతో జాతీయ, రాష్ట్ర స్థాయిల్లో మానవ హక్కుల కమిషన్ల ఏర్పాటుకు అవకాశం కల్పిస్తూ 1993 జాతీయ మానవ హక్కుల పరిరక్షణ చట్టం అమల్లోకి వచ్చింది. దీనిని 2006లో సవరించారు.

**జాతీయ మానవ హక్కుల కమిషన్:**

ఇది బహుళసభ్య వ్యవస్థ, భారత మాజీ ప్రధాన న్యాయమూర్తి అధ్యక్షునిగా, సుప్రీంకోర్టు న్యాయమూర్తి (పదవిలో ఉన్న లేదా విరమణ చేసిన), హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి (పదవిలోనున్న లేదా విరమణ చేసిన), మానవహక్కుల కార్యకలాపాల్లో చురుకుగా ఉన్న ఇద్దరు వ్యక్తుల్ని సభ్యులుగా నియమిస్తారు.

ప్రధానమంత్రి నేతృత్వంలో హెూం మంత్రి, లోక్సభ స్పీకర్, లోక్సభ, రాజ్యసభల్లోని ప్రతిపక్ష నాయకులు, రాజ్యసభ ఉపాధ్యక్షులు సభ్యులుగా ఉన్న కమిటీ సిఫార్సు మేరకు కమిషన్ సభ్యులను రాష్ట్రపతి నియమిస్తారు. పదవీకాలం ఐదు సంవత్సరాలు లేదా 70 సంవత్సరాలు వయసు వచ్చేంత వరకు (ఈ రెండింటిలో ఏది ముందు జరిగితే అది). అధ్యక్షుడి పదవీ కాలం ఐదేళ్లు. సభ్యులు రెండుసార్లు పదవిలో (పదేళ్లు) కొనసాగవచ్చు. అయితే 70 సంవత్సరాల వయోపరిమితి నిబంధన వర్తిస్తుంది. పూర్తికాల సభ్యులతో పాటు షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, అల్ప సంఖ్యాక వర్గాల కమిషన్, జాతీయ మహిళా కమిషన్ అధ్యక్షులు పదవీ రీత్యా దీనిలో సభ్యత్వాన్ని పొందుతారు. కమిషన్ ముఖ్య కార్యనిర్వహణాధికారికి సెక్రటరీ జనరల్ హెూదాఉంటుంది. ఈ అధికారికి భారత ప్రభుత్వ కార్యదర్శి స్థాయి ఉంటుంది.

**విధులు**

1) కమిషన్ స్వయంగా లేదా బాధితుని పిర్యాదు మేరకు లేదా న్యాయస్థానం ఉత్తర్వు మేరకు మానవ హక్కుల ఉల్లంఘనలను విచారించడం
2) న్యాయస్థానం అనుమతి మేరకు మానవ హక్కుల ఉల్లంఘన ఆరోపణలకు సంబంధించిన వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడం
3) ప్రభుత్వ నిర్వహణలోని సంస్థలను, జైళ్ళను సందర్శించి అక్కడి పరిస్థితులను అధ్యయనం చేయడం
4) మానవ హక్కుల పరిరక్షణకు సంబంధించిన రాజ్యాంగ నిబంధనలను, శాసనసభలు రూపొందించిన చట్టాలను సమీక్షించి వాటిని ప్రభావవంతంగా అమలు చేయడానికి సూచనలివ్వడం
5) ఉగ్రవాద కార్యకలాపాల వల్ల మానవ హక్కులకు భంగం కలుగుతున్న పరిస్థితులను సమీక్షించి నివారణ చర్యలను సూచించడం
6) అంతర్జాతీయ ఒప్పందాలను అధ్యయనం చేసి అవి మానవ హక్కులకు ప్రతిబంధకాలుగా ఉంటే తగిన నివారణ చర్యలు సూచించడం
7) మానవ హక్కులకు సంబంధించిన అంశాల పై పరిశోధనలు జరపడం
8) సమాజంలో మానవ హక్కుల అక్షరాస్యతను ప్రోత్సహించి, ప్రజల్లో అవగాహన కల్పించడం
9) స్వచ్ఛంద సేవా సంస్థలను మానవ హక్కుల పరిరక్షణకు కృషి చేసేటట్లు ప్రోత్సహించడం

**అధికారాలు:**

తన విధులను నిర్వహించడానికి కమిషన్ సివిల్ కోర్టుకున్న అధికారాలను కలిగి ఉంటుంది. సమన్ల జారీకి, సంబంధిత వ్యక్తులను విచారించడానికి అవసరమైన అధికార పత్రాలు, అఫిడవిట్లు, సాక్ష్యాధారాలను సేకరించడానికి, న్యాయస్థానం లేదా ప్రభుత్వ కార్యాలయం నుంచి అవసరమైన సమాచారం పొందడానికి, అధికార ప్రతులను విచారించి, పరిశీలించే అధికారాన్ని కలిగి ఉంది.

కమిషన్ తాను దర్యాప్తు చేస్తున్న కేసును, మేజిస్ట్రేట్కు పంపడానికి రాష్ట్ర మానవ హక్కుల కమిషన్కు ఏదైనా కేసును బదిలీ చేయడానికి అధికారం ఉంటుంది. విచారణ సమయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సేవలను వినియోగించుకోవచ్చు. ఆ సమయంలో సదరు ఉద్యోగులు కమిషన్ పరిధిలో పని చేస్తారు. తనకందిన ఫిర్యాదుల పై తగిన సమాచారం ఇవ్వాలని సంబంధిత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలను కమిషన్ కోరవచ్చు. సకాలంలో ప్రభుత్వం నుంచి తగిన సమాచారం



లభించకపోతే తానే స్వయంగా విచారణ నిర్వహించవచ్చు. విచారణ ముగిసిన తర్వాత, కమిషన్ దృష్టిలో మానవ హక్కుల ఉల్లంఘన జరిగినట్లు నిర్ధారణ జరిగితే బాధితులకు లేదా వారి కుటుంబ సభ్యులకు నష్టపరిహారమివ్వాలని, కారకులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి సిఫార్సు చేయవచ్చు అంతేకాకుండా సుప్రీంకోర్టు లేదా హైకోర్టుల దృష్టికి తీసుకెళ్లి తగిన ఉత్తర్వులు (రిట్లు) జారీ చేయమని కోరవచ్చు.

సాయుధ బలగాలు మానవ హక్కుల ఉల్లంఘనకు పాల్పడ్డాయని ఫిర్యాదులు అందినప్పుడు తగిన వివరణ ఇవ్వమని ప్రభుత్వాన్ని కోరే అధికారం కమిషన్కు ఉంది. ప్రభుత్వం తాను తీసుకున్న చర్యల వివరాలు కమిషన్కు తెలియజేయాలి. కమిషన్ వార్షిక నివేదికను ప్రభుత్వానికి సమర్పిస్తుంది. దాన్ని పార్లమెంట్లో ప్రవేశపెడుతారు.

మనిషి మనిషిగా మనుగడ సాగించేందుకు అనివార్యంగా అవసరమైన హక్కులను మానవ హక్కులు అంటారు. మానవునికి కావల్సిన నైతిక హక్కులు, చట్టపరమైన హక్కులే మానవ హక్కులు. మానవుడు గౌరవప్రదంగా జీవించడానికి అవసరమైన పౌర, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక హక్కుల సమాహారమే మానవ హక్కులు. ఆదిమ సమాజంలో మానవ హక్కులు అందరికి సమానంగా లభించేవి. క్రమంగా మానవ నాగరికతతో పాటు సామాజిక, ఆర్థిక అసమానతలు కూడా పెరుగుతూ వచ్చాయి. ఆధిపత్య వర్గాలు నిమ్న వర్గాలను శ్రమ దోపిడికి గురిచేస్తూ సామాజిక దోపిడికి గురిచేయడం వలన బలహీన వర్గాల మానవ హక్కులు ఉల్లంఘనకు గురైనాయి.

అంతర్జాతీయంగా ఇంగ్లాండ్ 1215లో మానవ హక్కులకు సంబంధించి చేసిన మాగ్నకార్టా వల్ల మొదటిసారిగా మానవ హక్కులు అనే భావన ప్రపంచ వ్యాప్తంగా వెలుగులోకి వచ్చింది. క్రమంగా 18వ శతాబ్దపు చివరి నాటికి మానవ హక్కుల దృక్పథం ప్రచారంలోకి వచ్చింది. 1776లో వర్జీనియా హక్కుల బిల్లు ద్వారా అమెరిక స్వాతంత్ర్య ప్రకటన, 1789 నాటి ఫ్రెంచ్ విప్లవం ఫలితంగా మానవ హక్కులకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చింది.

ఐక్యరాజ్య సమితి 1948 డిసెంబర్ 10న మానవ హక్కుల సార్వత్రిక ప్రకటన చేసింది ప్రపంచ దేశాలలోని ప్రజల యొక్క పౌర, రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక హక్కుల పరిరక్షణ గురించి ప్రచారం చేయడం జరిగింది. స్వాతంత్ర్యం, న్యాయం, శాంతికి మానవ హక్కులే పునాది. సార్వత్రిక మానవ హక్కుల ప్రకటన చట్టం ముందు అందరు సమానమనే భావనకు ప్రాథమిక ఆధారం. అందరికి సమాన హక్కులుండాలని పేర్కొన్న ఈ ప్రకటన ఆధారంగా ప్రపంచంలోని అనేక దేశాలు తమ తమ స్థానిక పరిస్థితులకు తగినట్లుగా రాజ్యాంగ పరంగా ప్రజలకు మానవ హక్కులను కల్పించాయి. ఐక్యరాజ్యసమితి ఆమోదించిన ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక హక్కుల అంతర్జాతీయ ఒప్పందం 1976 నుండి అమలులోకి వచ్చింది. మన దేశంలో బ్రిటీష్ వలస పాలన కాలంలో మానవ హక్కుల ఉల్లంఘన తీవ్రస్థాయిలో జరిగింది. సామాజిక, సాంస్కృతిక ఉద్యమాల ప్రభావం వల్ల మానవ హక్కుల పట్ల ప్రజల్లో చైతన్యం కలిగింది.

స్వాతంత్ర్యానంతరం రాజ్యాంగ రూపకల్పన సమయంలో వ్యక్తి గౌరవ జీవనానికి, అధిక ప్రాముఖ్యత నివ్వడం జరిగింది. రాజ్యాంగంలో 21వ ప్రకరణ వ్యక్తి గౌరవ ప్రదంగా జీవించేందుకు హమీనివ్వడం జరిగింది. సార్వత్రిక మానవ హక్కుల ప్రకటన వాక్ స్వాతంత్ర్య హక్కు, స్వేచ్ఛగా సంచరించడం, పని హక్కు, సమాన పనికి సమానవేతనం, విద్యాహక్కు, సామాజిక భద్రత కల్పించే హక్కులను మానవ హక్కులుగా గుర్తించింది. రాజ్యాంగంలోని 14-32 వరకు గల ప్రాథమిక హక్కులు వ్యక్తి గౌరవానికి దోహదపడతాయి.

ప్రపంచ వ్యాప్తంగా పాలస్తీనా, పాకిస్తాన్, మయన్మార్, వంటి దేశాలలో అదేవిధంగా అరబ్ దేశాలలో నియంతృత్వ పాలన వల్ల మానవ హక్కులు ఉల్లంఘనకు గురవుతున్నాయి. సోవియట్ యూనియన్ విచ్ఛిన్నం తరువాత అమెరికా అనేక దేశాల అంతరంగిక విషయాలలో జోక్యం చేసుకోవడం, అంతర్జాతీయంగా ఆధిపత్యం కోసంజరుపుతున్న యుద్ధాల వల్ల కూడా మానవ హక్కుల ఉల్లంఘన జరుగుతున్నది. ప్రపంచ వ్యాప్తంగా అమ్నెస్టీ ఇంటర్నెషనల్ మానవ హక్కుల పరిరక్షణకు ప్రధానంగా కృషి చేస్తున్నది. అమ్నెస్టీ ఇంటర్నెషనల్ స్ఫూర్తితో హ్యూమన్ రైట్స్ ఫోరమ్లు, పౌర హకుల సంఘాలు, స్వచ్ఛంధ సంస్థలు మానవ హక్కుల పరిరక్షణకు కృషి చేస్తున్నాయి. మానవ హక్కుల పరిరక్షణలో ప్రసార మాధ్యమాల పాత్ర క్రియాశీలకంగా ఉన్నది. మానవ హక్కుల గురించి ప్రజల్ని చైతన్యపర్చిన సాధనాలలో చలన చిత్రాలకు కీలక పాత్ర ఉందని చెప్పవచ్చు.

మన దేశంలో కోర్టులు ప్రాథమిక హక్కులకు పూర్తి హమీ నివ్వడం హర్షించదగ్గ విషయం దీనికి తోడు 2005లో వచ్చిన సమాచార హక్కు చట్టం ప్రభుత్వం ప్రజల పట్ల బాధ్యతాయుతంగా ఉండాల్సిన తీరును చట్టపరంగా చెప్పడం వలన ప్రభుత్వంలో జవాబు దారితనం పెరిగి పరోక్షంగా పేద, బలహీన వర్గాలకు సంబందించిన ప్రయోజనాలను కాపాడటం వల్ల మానవ హక్కులు పరిరక్షించబడుతున్నాయి. న్యాయ వ్యవస్థ క్రియాశీలత, ప్రజాచైతన్యం, చలనచిత్రాల ప్రభావం, మానవ హక్కుల పరిరక్షణకు దోహదపడుతున్నాయి.



Dr. P. Harish,
Director
Perfect Academy,
Hyderabad.

# పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

**వెలుగోడు, మేజర్‌న్యూస్ :** పేదల సంక్షేమం కూటమి ప్రభుత్వం లక్ష్యమని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి అన్నారు. మండలంలోని మోత్కూరు, తిమ్మనపల్లె గ్రామాల్లో బుధవారం ఎన్టీఆర్ సామాజిక భద్రత పింఛన్ పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. మోత్కూరు గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యేకు గ్రామ టీడీపీ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. స్వయంగా లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి పింఛన్ పంపిణీ చేసి వారి బాగోగులు తెలుసుకున్నారు. పేదల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేస్తున్న కృషిని ఎమ్మెల్యే వివరించారు. మహిళలు ఎమ్మెల్యేకు త్రాగునీటి సమస్యను తెలిపారు. రెండు రోజుల్లో సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు.



పింఛన్ పొందిన లబ్ధిదారులతో ఎమ్మెల్యే బుడ్డా

తిమ్మనపల్లి గ్రామంలో మంజూరైన నూతన పింఛన్లను పంపిణీ చేశారు. ఆ గ్రామ నాయకులు ఆయన ఘనంగా స్వాగతం పలికి పూలమాలలతో సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రజలకు మంచి చేయాలనే ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం పని చేస్తుందని వైసీపీలాగా దుర్మార్గపు ఆలోచనలు తమకు లేవని అన్నారు. గడిచిన 18 నెలల కాలంలో శ్రీశైలం నియోజకవర్గంలో రూ. 250 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. నియోజకవర్గ ప్రజలకు ఆయన నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీశైలం నియోజకవర్గ సమన్వయకర్త అన్నారావు శేషి రెడ్డి, మండల అధ్యక్షులు అబ్దుల్ కలాం, రఘుస్వామి రెడ్డి, ఖలీలుల్లాఖాన్, అమీర్ హంజా, మండలంలోని నాయకులు, తదితరులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని సిపి నగర్‌లో ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి ఆదేశాల మేరకు పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని సచివాలయ సిబ్బందితో వెలుగోడు మైనార్టీ నాయకులు డా.జాకీర్ హుస్సేన్ నిర్వహించారు. ఆయన కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పింఛన్‌దారులకు వివరించారు.

# పండ్ల మొక్కల ప్రూనింగ్‌చేసే పరికరాలు పంపిణీ

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్:** ప్రకృతి వ్యవసాయ పద్దతిలో 5 లేయర్ల పద్దతిలో పండ్ల మొక్కలు సాగు చేసే రైతులకు ప్రూనింగ్‌కు ఉపయోగపడే కత్తెర, డ్రమ్ములను పంపిణీ చేసినట్లు సెర్టిస్ సంస్థ జిల్లా అధికారి నారాయణ, రైతు సాధికార సంస్థ ఎస్సార్పి నరేంద్ర గౌడులు తెలిపారు. బుధవారం మండల పరిధిలోని కొట్టాల చెరువు గ్రామంలో రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో కత్తెర్లు, డ్రమ్ములు పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పూర్తిగా ప్రకృతి వ్యవసాయ పద్దతిలో పండ్ల మొక్కలు సాగుచేస్తు ఒకే పంట కాకుండా పలు రకాల పండ్ల మొక్కలను సాగు చేయడం వల్ల అధిక లాభాలు పొందవచ్చన్నారు. గ్రామంలో సె ట్రిస్ ఆధ్వర్యంలో పండ్ల మొక్కలు పంపిణీ చేయడం జరిగిందని, పండ్ల మొక్కలు నాటుకోవాలనుకొనే రైతులకు తమ సంస్థ ద్వారా ఇవ్వడం జరుగుతుందన్నారు. అలాగే బయోగ్యాస్ ఏర్పాటు చేసుకునే వారికి కూడా ఇస్తామని చెప్పడం జరిగిందన్నారు. ప్రతి రైతు కూడా ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపాలని, దీని వల్ల పెట్టుబడి తగ్గి దిగుబడి పెరుగుతుందన్నారు. రసాయనికి ఎరువుల ద్వారా చేసే వ్యవసాయం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, ఇకే పంట కాకుండా పంట మార్పిడి చేయాలని రైతులకు సూచించారు. పండ్లతోటలతో పాటు అంతర పంటలు వేసుకోవడం ద్వారా రైతులు లాభం పొందవచ్చన్నారు. దేశీవాళి విత్తనాలను సాగు చేయాలని రైతులకు సూచించారు. డ్రమ్ములను జీవామృతం తయారికి ఉపయోగించుకోవాలన్నారు.



రైతులకు కత్తెర్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

పండ్ల మొక్కల పెంపకం రైతులకు ప్రూనింగ్ ఎలా చేయాలో ప్రయోగాత్మకంగా చేసి వివరించడమైందన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా కోఆర్డినేటర్ బాబు, సబల్ ఎన్జీఓ సిసి శివనాయక్, అశోక్, ఆర్‌వైఎస్‌ఎస్ డిఎంఎంటి సయ్యద్ బాషా, ఎఫ్ఎంటి సరస్వతి, ఎంపిఇఒ ముర్తుజావలి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ఈ ఆటోలపై కౌన్సిల్‌లో రగడ

– ప్రజలపై భారం వైసీపీ సభ్యులు



అధ్యక్షత వహించిన మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నీసా



కౌన్సిల్‌లో మాట్లాడుతున్న కౌన్సిలర్ ఖండే శ్యాంసుందర్‌లాల్



కౌన్సిలర్ల మధ్య వాదోపవాదాలు జరుగుతున్న దృశ్యం

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** నంద్యాల మున్సిపల్ సర్వసభ్య సమావేశం వాడివేడిగా సాగింది. అజెండాలోని 18 అంశాలను కౌన్సిల్ ముందు ఆమోదంకు ఉంచగా 7వ అంశంను రద్దు చేయగా 12 అంశాలు వాయిదాపడ్డాయి. ఈరెండు అంశాలతు మినహా మిగిలిన వాటికి కౌన్సిల్ సమావేశం లో ఆమోదముద్ర వేశారు. బుధవారం కౌన్సిల్ సమావేశం చైర్మన్ మాబున్నీసా అధ్యక్షతన జరిగింది. ఈకౌన్సిల్ సమావేశంలో ఎలక్ట్రానిక్ ఆటోల అంశం తీవ్ర రాజకీయ రగడకు దారితీసింది. ఈ ఆటోల ప్రవేశంతో ఎలాంటి లాభం లేకుండా నేరుగా ప్రజలపైనే పన్నుల భారం మోపే పరిస్థితి ఏర్పడుతోందని వైసీపీ కౌన్సిలర్లు ఖండించారు. గతంలో చెత్తపన్ను పేరుతో ప్రజలపై భారం మోపారని అప్పట్లో టీడీపీ వారు విమర్శించారు. ఇప్పుడు అదే తరహాలో ఎలక్ట్రానిక్ ఆటోల పేరుతో కూడా ప్రజల నుంచే పన్నులు వసూలు చేసే విధానాన్ని తీసుకుని వస్తున్నారని వైసీపీ కౌన్సిలర్లు ఆరోపించారు. ఈ నిర్ణయం వల్ల పట్టణ ప్రజలు పన్నుల పరంగా ఆర్థికంగా నష్టపోతారని నిత్యావసర ఖర్చులు మరింత పెరిగే ప్రమాదం ఉందన్నారు. పర్యావరణ పరిరక్షణ పేరుతో తీసుకుంటున్న నిర్ణయాలు ప్రజలపై భారంగా మారుతున్నాయని వైసీపీ కౌన్సిలర్లు వ్యాఖ్యానించారు. ఇరుపార్టీల కౌన్సిలర్ల మధ్య వాదోపవాదాలు తీవ్రస్థాయికి చేరింది. మా ప్రభుత్వంలో చెత్త సేకరణకు ఇంటింటికి ఒక్కరూపాయి వసూలు చేస్తుంటేనే వైసీపీ ప్రభుత్వం చెత్త ప్రభుత్వం అని గగ్గోలు పెట్టిన మీరు చెత్త సేకరణకు నంద్యాల టౌన్‌కు 63 ఈ ఆటో వాహనాలను ఒక్కో వాహనానికి నెలకు రూ.68,949 చెల్లించి అద్దె ప్రాతిపదికన తీసుకోవాలని మున్సిపల్ అధికారులు చూడడం ప్రజలపై భారం పడుతుందన్నారు. ఈ ఆటో నిర్ణయాన్ని రద్దు చేయాలని వైసీపీ సభ్యులు డిమాండ్ చేయగా అలాకాదని పట్టణంలో ఇంటింటికి తిరిగి తడిపొడి చెత్తను సేకరించాలంటే ప్రస్తుత పరిస్థితుల్లో ఈ ఆటో వాహనాలు తప్పక అవసరమని కమిషనర్ శేషన్న సభ్యులకు తెలిపారు. ఎలక్ట్రానిక్ ఆటోలతో ప్రజలపైనే పన్నుల భారం సామాన్యులకు నష్టమంటూ వైసీపీ కౌన్సిలర్లు అభ్యంతరం తెలిపారు. వాహనాలను ఉపయోగించడం వల్ల మున్సిపాలిటీకి భారం పడడానికి ఆర్థిక సమస్యలు రావని ప్రజలపై భారం పడదని కమిషనర్ శేషన్న తెలుపగా ఈ అంశాన్ని రద్దు చేశామని దానిపై చర్చ అవసరం లేదని చైర్మన్ అన్నారు. నంద్యాల పట్టణంలో కుక్కలకు సంబంధించి ఏబీసీ, ఏఆర్‌వి చేయించుటకు కౌన్సిల్ ఆమోదంకు ఉంచగా టీడీపీ సభ్యులు జైనాబీ, శ్రీదేవి, శ్యాంసుందర్‌లాల్ అధికారుల తీరుపై మండిపడ్డారు. వీధులలో కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయని కుక్కలను పట్టే విషయంలో పెద్ద స్కాం జరుగుతుందని ఎక్కడ కూడా కుక్కలు తగ్గడం లేదని సమావేశం దృష్టికి తేగా అలాంటిది ఏమీ లేదని సభ్యులు పరిశీలించవచ్చని ఏబీసీ, ఏఆర్‌వి కేంద్రాలను కౌన్సిల్ సభ్యులు సందర్శించి పరిశీలించవచ్చన్నారు. 18అంశాల్లో ఈ ఆటో వాహనాలు ఏర్పాటు అంశం, అలాగే మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్‌గా పనిచేయుటకు సంబంధించిన అంశాన్ని వాయిదా వేయగా మిగిలిన అంశాలకు కౌన్సిల్‌లో ఆమోదం లభించింది. కౌన్సిల్ సమావేశంలో కమిషనర్ శేషన్న, ఎంఈ గుర్రప్ప, టౌన్‌ప్లానింగ్ అధికారి మూర్తి, శానిటేషన్ సూపర్‌వైజర్ మురళీధర్‌రెడ్డిలు పాల్గొన్నారు.

# 26మందికి కారుణ్య నియామకాలు : జడ్‌పి సిఈఓ

**కర్నూలు జడ్‌పి, మేజర్‌న్యూస్ :** జిల్లా పరిషత్ యాజమాన్య పరిధిలో ఖాళీగా ఉన్న జూనియర్ అసిస్టెంట్లు, టైపిస్టులను, జూనియర్ ఆఫీస్ అసిస్టెంట్ పోస్టుల్లో అర్హత మరియు వారి అభీష్టం మేరకు జడ్‌పి చైర్మన్ పై పాపిరెడ్డి ఆధ్వర్యంలో కారుణ్య నియామకాల కింద ఉద్యోగం కల్పించినట్లు జడ్‌పి సిఈఓ జి నాసరరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా సిఈఓ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగి సర్వీసులో ఉంటూ చనిపోతే ప్రభుత్వ ఆదేశాల మేరకు కుటుంబంలో ఒకరికి కారుణ్య నియామకం కింద ఉద్యోగం కల్పించినట్లు తెలిపారు. కావున ఉద్యోగం పొందిన వారు వారికి కేటాయించిన ఉద్యోగంలో మంచి సేవలందించి ప్రభుత్వానికి, ప్రజలకు సేవ చేసి మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు. జడ్‌పి చైర్మన్ మాట్లాడుతూ కారుణ్య నియామకం కింద ఉద్యోగం కల్పిస్తూ సాధ్యమైనంత వరకు వారికి అనుకూలమైన ప్రదేశంలోనే నియమించినట్లు తెలిపారు. కావున వీరంతా మంచి సేవలందించి మంచి పేరు తెచ్చుకోవాలని అందరికి అభినందనలు తెలిపారు.



కారుణ్య నియామక పత్రాలు అందుకున్న వారితో అధికారులు

## హిందువులు ఐక్యమత్యంతో సనాతన ధర్మాన్ని పాటించాలి

**కొత్తపల్లి, మేజర్‌న్యూస్ :** హిందువులు అందరు ఐక్యమత్యంతో సనాతన ధర్మాన్ని పాటించాలని ఆధ్యాత్మికవేత్త శ్రీ శశిభూషణ సిద్ధాంతి తెలిపారు. బుధవారం మండల కేంద్రమైన కొత్తపల్లిలో హిందూ సమ్మేళనంను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి హిందువులోనూ ఆత్మవిశ్వాసం నింపడం కోసం ఆర్‌ఎస్‌ఎస్ 100 సంవత్సరాల్లోకి అడుగు పెడుతున్న సందర్భంగా హిందూ సమ్మేళనాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మన కులం అనేది ఇంటి వరకే పరిమితం కావాలని గడప దాటితే మనమంతా హిందువులం అనే భావన ప్రతి ఒక్కరు కలిగి ఉండాలని తెలిపారు. హిందూ దేవాలయాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు. ఈ కలియుగంలో సంఘటనశక్తిదే అంతిమ విజయం అన్నారు. ప్రతి హిందువు ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేసి హిందూ భావాలను బలపరచాలని తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన వక్త పరశురాముని రామకృష్ణ, వాసుదేవ రెడ్డి, హనుమంత రెడ్డి, లక్ష్మీనారాయణ ఆచారి, మారెన్న, రాజేష్, అధిక సంఖ్యలో హిందువులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

**టిడిపి జిల్లా ఉపాధ్యక్షుడు సలీంద్ర శ్రీనివాసులుయాదవ్**

**డోన్‌రూరల్, మేజర్‌న్యూస్:** ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని తెలుగుదేశం పార్టీ నంద్యాల జిల్లా ఉపాధ్యక్షులు సలీంద్ర శ్రీనివాసులుయాదవ్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని మిద్దెపల్లె గ్రామంలో వికలాంగులకు, వృద్ధులకు పింఛన్ పంపిణీ కార్యక్రమంలో నంద్యాల జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షుడు సలీంద్ర శ్రీనివాసులు యాదవ్, రాష్ట్ర వాల్మీకి ఫెడరేషన్ డైరెక్టర్ వలసల రామకృష్ణ, మాజీ ఎంపిపి దేవరబండ నారాయణ, మిద్దెపల్లె గోవిందు, మిద్దెపల్లె సుధాకర్‌లు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, డోన్ నియోజకవర్గం ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మల ఆదేశాల మేరకు గ్రామంలో ప్రతి ఇంటింటికి తిరిగి పింఛన్ పంపిణీ చేశారు.



వృద్ధుడికి పింఛన్ పంపిణీ చేస్తున్న జిల్లా ఉపాధ్యక్షులు, టిడిపి నాయకులు

## కూటమి ప్రభుత్వంలో ఒకరోజు ముందు భరోసా పింఛన్ల పంపిణీ

**ఆస్పరి, మేజర్ న్యూస్ :** సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పిలుపుమేరకు బుధవారం ఆస్పరి మండలం, గ్రామం నందు ఆలూరు తాలుక ఇంచార్జీ వైకుంఠం జ్యోతి మాజీ ఇంచార్జీ వైకుంఠం ప్రసాద్ ఆధ్వర్యంలో కూటమి నాయకులు మాజీ ఎంపిటీసీ కృష్ణయాదవ్, జనసేన కన్వీనర్ అరవింద్ యాదవ్, టీడీపీ నాయకులు యాగంటి రఘు, ఎస్ మహేష్, ఫోటో వీరేష్, సంజన్న ఆదేశాల మేరకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను వృద్ధులకు, వితంతువులకు, వికలాంగులకు, కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న వాళ్లకు ఇంటింటికెళ్లి పెన్షన్ పంపిణీ చేస్తూ, కూటమి ప్రభుత్వం అమలు చేసిన సూపర్ సిక్స్ పథకాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి కృష్ణయాదవ్, జనసేన కన్వీనర్ అరవింద్, తాలుక తెలుగు యువత నాయకులు మహేష్, టీడీపీ యూత్ కన్వీనర్ యాగంటి రఘు, సొసైటీ డైరెక్టర్ సంజన్న, వార్డుమెంబర్లు, వీరేష్, పోలీస హంపయ్య, నాయకులు ఎడ్డి శీను, చావ మహానంది, నవీన్ యాదవ్, సచివాలయం సిబ్బంది, వివిధ హోదాల్లో ఉన్న కూటమి నాయకులు పాల్గొన్నారు.



పింఛన్లను పంపిణీ చేస్తున్న మాజీ ఎంపిపి, జనసేన కన్వీనర్

## ఆర్యవైశ్యుల అభివృద్ధికి టీడీపీ భరోసా– నంద్యాల నాగేంద్ర

**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్ :** ఆర్యవైశ్యుల అభివృద్ధికి తెలుగుదేశం పార్టీ భరోసా ఇస్తుందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి నంద్యాల నాగేంద్ర అన్నారు. ఆర్యవైశ్యుల కోరికను మన్నించి పెనుగొండను వాసవి పెనుగొండగా మార్పు జివో విడుదల చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్‌కు తాము రుణపడి ఉంటామని అన్నారు. అలాగే ఆర్యవైశ్యులకు ఈసారి ప్రభుత్వంలో ఎన్నో మంచి అవకాశాలు కల్పించారని అన్నారు.వారికి కృతజ్ఞతలు తెలిపారు. అభివృ ద్ధికి కూటమి ప్రభుత్వం నిరంతరం పాటుపడుతుందని తెలిపారు. కర్నూలు పార్లమెంట్ ఉపాధ్యక్షులు సోమిశెట్టి శ్రీకాంత్, ఏపీ ఐటిటీ డైరెక్టర్ మనోజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సూర్య
గురువారం 01 జనవరి 2026













